తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఆదివారం
5 అక్టోబరు, 2025




# పావురం నుంచి ఉత్తరం దాకా..

# 'అఖండ 2' డిసెంబరులో విడుదల



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'అఖండ 2' షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. మొదట పవన్ కళ్యాణ్ 'ఓజీ'తో క్లాష్ అవ్వాలని అనుకున్నా, అనివార్య కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ఇక దీంతో ఈ సినిమా రిలీజ్ డేట్‌ను రీసెంట్‌గా బాలకృష్ణ స్వయంగా డిసెంబర్‌లో విడుదలవుతుందని ప్రకటించారు.

అయితే, పవన్ కళ్యాణ్ 'ఓజీ' చిత్ర ప్రీమియర్ షోలో 'అఖండ 2' రిలీజ్ డేట్‌పై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5, 2025న ఈ హై వోల్టేజ్ యాక్షన్ డ్రామా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు ఓ టీజర్‌ను 'ఓజీ' ప్రింట్స్‌కు జత చేసి ప్రదర్శించారు. ఈ విషయం నందమూరి అభిమానులకు నిజంగా పెద్ద పండుగ కానుందని చెప్పాలి.

ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆది పినిశెట్టి విలన్‌గా కనిపించనున్నారు. బాలీవుడ్ చైల్డ్ ఆర్టిస్ట్ హర్షాలీ మల్హోత్రా ఈ సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీనాథ్ అచంట భారీ స్థాయిలో నిర్మిస్తుండగా, ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.

తారాతీరం

# ద్విభాషా చిత్రం 'ద్రౌపది'

రిచర్డ్ రిషి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ద్రౌపది 2' సినిమా చిత్రీకరణ పూర్తయింది. తమిళ, తెలుగు భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మోహన్.జి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామా షూటింగ్ ముగిసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

జి.ఎం. ఫిల్మ్ కార్పొరేషన్, నేతాజీ ప్రొడక్షన్స్ పతాకాలపై నిర్మాత చోళ చక్రవర్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 14వ శతాబ్దపు దక్షిణ భారతదేశ వైభవాన్ని, నాటి చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. భారీ విజువల్స్, ఆసక్తికరమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ సినిమా ఉండబోతోందని చెబుతున్నారు. దర్శకుడు మోహన్.జి "నిర్మాత చోళ చక్రవర్తి అందించిన సహకారం వల్లే సినిమాను అనుకున్న సమయానికి పూర్తి చేయగలిగానని, నిర్మాత పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో అత్యున్నత ప్రమాణాలతో సినిమాను తీర్చిదిద్దగలిగాను" అని ఆయన పేర్కొన్నారు. నిర్మాత చోళ చక్రవర్తి స్పందిస్తూ, దర్శకుడి పనితీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. "దర్శకుడు మోహన్ గారితో పని చేయడం సంతోషంగా ఉంది. ఆయన మద్దతుతో భవిష్యత్తులో మరిన్ని చిత్రాలు నిర్మించాలనే నమ్మకం కలిగింది" అని ఆయన వివరించారు.

ఈ చిత్రంలో రిచర్డ్ సరసన రక్షణ ఇందుసుదన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నట్టి నటరాజ్, వై.జి. మహేంద్రన్, దేవయాని శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, డిసెంబర్ నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది.



ఆదివారం వార్త

5 అక్టోబరు, 2025

## మంచి ముత్యాలు

- బోధకులు ఎప్పుడూ తాము చెప్పింది చేయమంటారే కానీ, తాము చేసినట్లుగా చేయమని చెప్పరు. - జాన్ సెల్డన్

- మానవులు బోధిస్తూ నేర్చుకుంటారు. - సెనెకా

## కదంబం

'సంఘీ'భావం....5

ట్రిపుల్ ఆర్ రోడ్డుపై రైతుల కన్నెర్ర

కవర్ స్టోరీ..6

పావురం నుంచి ఉత్తరం దాకా..

ఈ వారం కవిత్వం...12

సువిశాల విశ్వంలో..

కథ..20

అంతర్వాహిని

సాహిత్యం.. 22

ఉర్దూ-పర్షియన్ హైదరాబాద్ కీ షాన్

రాహు, కేతు దోష ... 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా.. వగైరా..

# సమాచారం

## రోజుకు రెండు గంటలే!

స్మార్ట్‌ఫోన్ వ్యసనం ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న తరుణంలో జపాన్‌లోని ఓ నగరం వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రజలు వినోదం కోసం స్మార్ట్ ఫోన్‌లు, పర్సనల్ కంప్యూటర్లు, టాబ్లెట్ల వాడకాన్ని రోజుకు కేవలం రెండు గంటలకు పరిమితం చేయాలని కోరుతూ ఒక ఆర్డినెన్స్‌ను ఆమోదించింది. టోయోవాకే మున్సిపల్ అసెంబ్లీ ఈ మేరకు మెజారిటీ ఓటుతో తీర్మానం చేసింది. జపాన్‌లో ఇలాంటి నిబంధన తీసుకువచ్చిన తొలి నగరంగా టోయోవాకే నిలిచింది. ఈ కొత్త నిబంధన అక్టోబర్ నుంచి అమల్లోకి రానుంది. అయితే, ఇది కేవలం ఒక మార్గదర్శకం మాత్రమేనని, దీన్ని ఉల్లంఘించిన వారిపై ఎలాంటి జరిమానాలు విధించబోమని నగర పాలక సంస్థ స్పష్టం చేసింది. చదువు, ఆఫీస్ పనులు, ఇంటి పనుల కోసం ఎలక్ట్రానిక్ పరికరాలను వాడుకోవడానికి ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశాన్ని నగర మేయర్ వివరిస్తూ- ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే మా ప్రధాన లక్ష్యం. స్మార్ట్‌ఫోన్ల వాడకం వల్ల నిద్రలేమి వంటి సమస్యలు వస్తున్నాయో లేదో ప్రజలు గమనించుకోవాలి. మేం స్మార్ట్‌ఫోన్‌లను వ్యతిరేకించడం లేదు, కానీ వాటి వాడకంలో పరిమితులు ఉండాలని కోరుతున్నాం" అని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలు పెంచడం కూడా ఈ ఆర్డినెన్స్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్స్‌లో భాగంగా, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రాత్రి 9 గంటల తర్వాత, 18 యేళ్లలోపు వారు రాత్రి 10 గంటల తర్వాత స్మార్ట్ ఫోన్లు, ఇతర గ్యాడ్జెట్లు వాడకుండా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ నిర్ణయంపై స్థానిక ప్రజల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు ఇది తమ వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడమేనని విమర్శిస్తుండగా, మరికొందరు కుటుంబంతో చర్చించడానికి ఇదొక మంచి అవకాశమని భావిస్తున్నారు. ప్రజల అభిప్రాయాలను, నిబంధన ప్రభావాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైతే మార్పులు చేస్తామని నగర కౌన్సిల్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.**

sunmagvaartha@gmail.com




## బంధువులు చేయిస్తారు

"నర్స్, రేపు నాకు ఆపరేషన్ అయిన తరువాత నేను స్నానం చేయవచ్చా?" అడిగాడు ప్రదీప్.

"ఈ హాస్పిటల్‌లో ఆపరేషన్ అయిన తరువాత బంధువులే స్నానం చేయిస్తారు" అంది నర్స్. ప్రదీప్ ప్రశ్నకు సమాధానంగా.

## అంతేనా?

"మీకు పార్టీ మారే ఆలోచన ఉన్నట్లు అందరూ అనుకుంటున్నారు" అడిగాడు విలేకరి నాయకుణ్ణి.

"అవినీతి గురించి చర్చ ఏమీ లేదుగా?" అన్నాడు నాయకుడు.

## బెయిల్ మీద..

"ఏరా! సూర్యం! సూపర్‌గా తయారయ్యావు, బాగా లావయ్యావు కూడా, చక్కని రంగు వచ్చావు. ఏంటి సంగతి?" అన్నాడు రంగ స్నేహితుడితో.

"ఓస్! అదా? ఆరు నెలల తరువాత జామీన్ మీద వచ్చాను" అన్నాడు సూర్యం.



## చాలా మార్పొచ్చింది..

"పరమేశంగారూ, మందులు వేసుకుని పూర్తిగా విశ్రాంతి తీసుకోమన్నాను కదా. మరి తేడా ఉందా?" అడిగాడు డాక్టర్.

"తేడా చాలా వుంది డాక్టర్. భార్య, పిల్లల్లో బాగా తేడా కనిపిస్తోంది" సమాధానమిచ్చాడు పరమేశం.

## చాటింగ్

"ఏరా, మీ వాడు రోజూ లైబ్రరీకి వెళ్తున్నాడు.. బుద్ధిమంతుడే!"

"ఆ... బుద్ధిమంతుడే, చక్కగా మొబైల్‌లో చాటింగ్ చేసుకోవచ్చని లైబ్రరీకి వెళ్తున్నాడు".

## పక్క గదిలో ఉన్నారు

అనిల్: డాక్టర్! నేను, నా గర్ల్‌ఫ్రెండ్ ఫుడ్ పాయిజన్ వల్ల ఈ రూమ్‌లో వున్నట్టు నా భార్యకి చెప్పకండి.. ప్లీజ్" అన్నాడు.

డాక్టర్: అలాగే, మీ ఆవిడా, ఆమె బాయ్‌ఫ్రెండ్ ఫుడ్ పాయిజన్ వల్ల పక్క రూమ్‌లో వున్నరు".

## ముందు సీట్‌లో..

నాని: లల్లీ, నిన్న సినిమా మధ్యలో కోపంలో వెళ్లిపోయావు, ఏమైంది?

లల్లి: మన ముందు సీట్లో మా ఆయన పక్కింటి రమణి ఉన్నారు. కోపం రాదేమిటి మరి?

## ఒకింటికి వెళ్లాలిగా!

రమేశ్: రమ్యా, నువ్వు నా లవర్‌వి కదా, నా బైక్ మీద రావడానికి భయం ఎందుకు? అన్నాడు.



రమ్య: నువ్వు అలాగే చెప్తావు. ఎప్పటికైనా నేను ఒక మంచి ఇంటికి కోడలిగా వెళ్లాల్సినదాన్ని.

## ఐ యామ్ సారీ!

నాగరాజు: సిస్టర్, ఆపరేషన్ అయిన తరువాత డాక్టర్ నా గురించి ఏమంటారు?

సిస్టర్: చాలా సార్లు ఐ యామ్ సారీ.. ఐ యామ్ సారీ అంటారు.

## మాట్లాడకపోతే..

పరమేశం: ఏమే కాంతం! ఒక్క పది నిమిషాలు మాట్లాడకుండా ఉంటే నీకు ఒక మంచి చీరె కొంటాను.

కాంతం: అయిదు నిమిషాల తరువాత ఏమండీ! పది నిమిషాలు అయిందేమోనండీ!" అంది.

## గుర్తుకు రావడానికి..

రజని: మా ఆయనకి పాతవి గుర్తుకు రావడానికి గరిటెడు ఆకు మందు ఇస్తున్నాను... అంది.

రమణి: ఔనా, మా ఆయనకి రెండు పెగ్గులు ఇస్తే చాలు.. అన్నీ చెప్పేస్తాడు.

– ఈ.ఎస్.మాధవన్

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు... వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపవలసిన చిరునామా:
నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com

## 'సంఘీ' భావం



# ట్రిపుల్ ఆర్ రోడ్డుపై రైతుల కన్నెర్ర

హైదరాబాద్ నగరం చుట్టూ ప్రస్తుతం ఉన్న అవుటర్ రింగు రోడ్డుకు ఆవల నిర్మిస్తున్న రీజనల్ రింగు (ట్రిపుల్ ఆర్) రోడ్డు రైతులకు ఆందోళనకు గురిచేస్తోంది. సంవత్సరానికి రెండు పంటలు పండే తమ భూములను ఆర్ఆర్ఆర్ కోసం ఇవ్వడానికి రైతులు సిద్ధంగా లేరు. పైగా ఈ నిర్మాణం విషయంలో రాజకీయాలు చోటు చేసుకోవడంతో రైతుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. తమ భూములను సరైన నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం సేకరిస్తోందన్న ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మిస్తున్న ప్రాంతాలకు చెందిన రైతులు రోడ్డెక్కి ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ఏయే భూములు సేకరిస్తున్నారు, ఎంత పరిహారం చెల్లిస్తారన్న విషయంలో స్పష్టత లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే తమ భూములకు లక్షల్లో పరిహారం ఇస్తే తాము అంగీకరించేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

హైదరాబాద్ రీజనల్ రింగు రోడ్డును రాష్ట్రంలోని 8 జిల్లాల మీదుగా సుమారు 340 కిలోమీటర్ల మేర నిర్మించడానికి నిర్ణయించారు. ప్రాథమికంగా 17 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణలోని పలు జిల్లాలను కలుపుతూ 340 కిలోమీటర్ల మేర ఈ రింగు రోడ్డును నిర్మించనున్నారు. సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, చౌటుప్పల్ వరకు 158 కిలోమీటర్ల మేర ఉత్తర భాగం; చౌటుప్పల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, ఆమనగల్, సంగారెడ్డి వరకు దక్షిణ భాగంగా 182 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు కేంద్రం ప్రభుత్వం అనుమతించింది. ఉత్తర భాగంలోని 158 కిలోమీటర్లలో సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి, చౌటుప్పల్ ప్రాంతాలు ఉన్నాయి. ఇక దక్షిణ భాగం 182 కిలోమీటర్లలో చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి ప్రాంతాలు ఉన్నాయి. దక్షిణ, ఉత్తర భాగాలుగా ట్రిపుల్ ఆర్ రోడ్డును విభజించి నిర్మిస్తున్నారు. ఈ విభజన కేవలం నిర్మాణ సౌలభ్యం కోసం మాత్రమేనని. ప్రాజెక్ట్ మొత్తం మాత్రం ఒకే పరిధిలోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం రీజనల్ రింగ్ రోడ్డును ఆనుకుని రైల్వే లేను కూడా నిర్మించాలని నిర్ణయించారు. దీనితో మరో 40 అడుగుల వెడల్పుతో రోడ్డును పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ భూసేకరణ మారుతున్న డిజైన్లతో పెద్ద మొత్తంలో భూములను సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముందుగా 659.53 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించినప్పటికీ అలైన్‌మెంట్ మార్పుతో ప్రస్తుతం ఏకంగా 853 ఎకరాలకు పెరిగింది. ప్రస్తుతం డిజైన్‌లో కూడా స్వల్ప మార్పులు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే హైదరాబాద్ శివార్లలో భూముల ధరలు గణనీయంగా పెరిగాయి. తక్కువలో తక్కువగా ఎకరం కనీసం రెండు నుంచి 8 కోట్ల రూపాయలు పలికే ప్రాంతాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించేందుకు నిర్ణయించడం వివాదాస్పదంగా మారింది. ఈ రోడ్డు నిర్మించడం వల్ల లక్షలాది వాహనాలు రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ నగరానికి, శివారు ప్రాంతాలకు రాకుండా గమ్యాలు చేరే అవకాశం కల్పిస్తుంది. దీనివల్ల వాహనదారులకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. వేగంగా గమ్యం చేరుకోవడానికి, ఇంధన పొదుపునకు ఈ రీజనల్ రింగ్ రోడ్డు ఎంతో ఉపకరిస్తుంది. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డు వరకు నగరం విస్తరించడంతో ఆయా ప్రాంతాలు రద్దీగా మారాయి. ఇప్పటికే ఓఆర్ఆర్‌పై గరిష్ట స్థాయిలో వాహనాలు పరుగులు తీస్తున్నాయి. మరో పదేళ్లలో ఓఆర్ఆర్‌పై కూడా ట్రాఫిక్ జాములు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి.

వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రిపుల్ ఆర్ రోడ్డును నిర్మిస్తున్నారు. అయితే రైతులకు అందించాల్సిన పరిహారం విషయంలో మాత్రం ప్రస్తుతం సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లు కాకుండా మార్కెట్ వాల్యూను పరిగణనలోకి తీసుకుని నష్ట పరిహారం చెల్లించాలని కొందరు రైతులు పేర్కొంటున్నారు. తమ వద్ద ఎంత భూమి సేకరించారో ఆ మేరకు భూమిని తమకు ప్రత్యామ్నాయంగా కేటాయించాలని మరికొందరు రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా భూమి సేకరణ ఎప్పుడు జరుగుతుందో అప్పటికప్పుడు తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులందరూ ముక్త కంఠంతో కోరుతున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

# పావురం నుంచి ఉత్తరం దాకా..

యేచన్ చంద్రశేఖర్

**"తోక లేని పిట్ట తొంభై ఆమడల దూరం చేరుకుంది. అదేమిటో చెప్పుకోండి చూద్దాం?" అనేది ఒకప్పటి పొడుపు కథ. దీనికి సమాధానం 'ఉత్తరం' లేదా "లేఖ'. తోకలేని పిట్టగా ఉత్తరాన్ని అభివర్ణిస్తారు. ఎందుకంటే ఇది ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి ఎంత దూరమైనా ప్రయాణిస్తుంది. కానీ దానికి తోక లేదు.**




ప్రాచీన కాలంలో పావురాల ద్వారా మొదలైన భారతదేశ తపాలా సేవల చరిత్ర వార్తాహరుల (మెసెంజర్) వ్యవస్థలతో ప్రారంభమై 18వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించిన వ్యవస్థల ద్వారా కొనసాగి, 1854లో అధికారిక ఇండియా పోస్ట్ ఆఫీస్ చట్టం ఏర్పాటుతో నవశకానికి నాంది పలికింది. చట్టం రూపం సంతరించుకున్న తరువాత ఇది తపాలా రేట్లను ఏకీకృతం చేసి లార్డ్ డల్హౌసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా తపాలా బిళ్ళలను (స్టాంపులను) ప్రవేశపెట్టింది. 1947లో భారత స్వాతంత్ర్యానంతరం, రూపాంతరం చెందిన ఈ సేవ గణనీయంగా విస్తరించి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సేవలు అందించేందుకు కాలానుగుణంగా ఆధునీకరించబడింది. ప్రజా సేవ కోసం ప్రారంభించబడిన ఈ వ్యవస్థ తన పేరును సార్థకం చేసుకునే ప్రక్రియలో భాగంగా 'సహాయానికి ముందు సేవ' (సర్వీస్ బిఫోర్ హెల్ప్) అనే దాని ప్రస్తుత నినాదాన్ని స్వీకరించింది.

అయితే, ప్రపంచంలోనే తపాలా సేవలను ప్రారంభించిన మొట్టమొదటి దేశంగా ఈజిప్ట్ పరిగణించబడుతుంది. సామాన్య శక పూర్వం (బిఫోర్ కామన్ ఎరా) 2400లో పురాతన ఈజిప్ట్‌లోని ఫారోల భూభాగం అంతటా డిక్రీలు, పరిపాలనా సందేశాలను చేరవేసేందుకు విశ్వసనీయ వార్తాహరులను (కొరియర్‌లను) ఉపయోగించి రాష్ట్ర ప్రాయోజిత పోస్టల్ సేవ ప్రారంభించబడింది. పెర్షియన్, హాన్ చైనీస్ సామ్రాజ్యాలు వంటి ఇతర పురాతన సామ్రాజ్యాలు కూడా ఇలాంటి రాష్ట్ర ప్రయోజనాల కోసం అధునాతన పోస్టల్, కొరియర్ వ్యవస్థలను అభివృద్ధి చేశాయి.

## ప్రపంచంలో తొలి పోస్టల్ వ్యవస్థలు

**పురాతన ఈజిప్ట్‌లో** ఫారోలు డిక్రీలను పంపడానికి, వారి విస్తారమైన భూభాగాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రాయోజిత కొరియర్ సేవను ఉపయోగించారు. పర్షియన్ సామ్రాజ్యానికి చెందిన అచెమెనిడ్ రాజవంశస్థులు క్రీ.పూ.550 ప్రాంతంలో, తమ విస్తారమైన సామ్రాజ్యం అంతటా సందేశాలను వేగంగా రవాణా చేసేందుకు రాయల్ రోడ్ల వెంట అశ్వారూఢులైన సైనికుల ద్వారా రిలే స్టేషన్ల వ్యవస్థను (ఛాపర్ ఖానేహ్ అని పిలుస్తారు) ఉపయోగించి అత్యంత సమర్థవంతమైన పోస్టల్ నెట్‌వర్క్‌ను స్థాపించారు.

చైనాలోని హాన్ రాజవంశీకులు సుమారు క్రీ.పూ.220 నాటికి, ముఖ్యమైన సందేశాలను రవాణా చేసేందుకు, కాగితపు ఎన్వలప్‌లలో నగదు బహుమతులను నిల్వ చేసేందుకు దాదాపు ప్రతి 10 మైళ్లకు కొరియర్ స్టేషన్ల వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఈ వ్యవస్థలు ప్రవేశపెట్టబడిన తొలినాళ్ళలో ఇవి ప్రధానంగా పాలకులు, ప్రభావవంతమైన నాయకుల రాష్ట్ర ఉపయోగం కోసం మాత్రమే అందుబాటులో ఉండేవి. కాలక్రమేణా ఈ సేవలు సామాన్య వ్యక్తులకు కూడా అందుబాటులోకి రావడంతో పాటు కొన్ని సందర్భాల్లో, చట్టబద్ధం కూడా చేయబడింది. 17వ శతాబ్దంలో బ్రిటన్ వంటి ప్రదేశాలలో నిర్ణీత రుసుములు, టైమ్ టేబుల్‌లతో అధికారిక పోస్టల్ సేవలను ఏర్పాటు చేయడంతో ప్రజా సేవలు కూడా ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

## భారతదేశంలో తపాలా చరిత్ర

అత్యంత పురాతనమైన మెయిల్ డెలివరీ భావనకు భారతదేశంలో ఘన చరిత్ర ఉంది. అథర్వణవేదం, క్రీ.పూ. 3వ శతాబ్దంనాటి చాణక్యుడి అర్థశాస్త్రంలో మెసెంజర్ సేవలు, కొరియర్ వ్యవస్థల ప్రస్తావనలు ఉన్నాయి. కొందరు చరిత్రకారులు చంద్రగుప్త మౌర్య భారతదేశంలో తొలి తపాలా వ్యవస్థను స్థాపించారని, తన విస్తారమైన సామ్రాజ్యం అంతటా సందేశాలను పంపడానికి పావురాలపై ఆధారపడ్డారని విశ్వసిస్తారు.

ఇండియా పోస్ట్ రికార్డుల ప్రకారం, భారతదేశంలో వెయ్యి సంవత్సరాలకు పైగా పావురాలు సుదూర సమాచార మార్పిడికి తమ సేవలు అందించాయి. 1296లో అల్లావుద్దీన్ ఖిల్జీ పాలనలో మొట్టమొదట అశ్వారూఢుల (గుర్రాల) ద్వారాను, కాలి నడక ద్వారాను ఉత్తరాలు బట్వాడా చేసే తపాలా వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రాచీన భారతదేశంలో ఆధునిక మెయిల్ డెలివరీ వ్యవస్థ లేనప్పటికీ, చాణక్యుడి అర్థశాస్త్రం పూర్వగామిగా పని చేసిన అత్యంత వ్యవస్థీకృత రాజదూత, గూఢచర్య నెట్‌వర్క్ గురించి వివరిస్తుంది. చాణక్యుడి శిష్యుడు మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుడు తన విశాలమైన సామ్రాజ్యంపై నియంత్రణను కొనసాగించడానికి ఈ వ్యవస్థను ఉపయోగించాడు. చంద్రగుప్త మౌర్యతో పాటు షేర్ షా సూరి వంటి పాలకులు కూడా తపాలా వ్యవస్థలను స్థాపించారు. పూర్వం రాజుల కాలంలో పావురాలను దూతలుగా ఉపయోగించి ఉత్తరాల బట్వాడా జరిపే వారని మనం చదువుకున్నాం. ఇది మాసిడోన్‌కు చెందిన అలెగ్జాండర్ 3 నుండి ఉద్భవించిందని భావిస్తారు. అలెగ్జాండర్ ఈ పద్ధతిని పురాతన పర్షియన్ల నుండి స్వీకరించి ఉండవచ్చని, పావురాలను అతను తన సైనికుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాల కోసం ఉపయోగించుకున్నాడని అంటారు. వారు క్రీ.పూ.5వ శతాబ్దం నుండే ఉత్తరాల బట్వాడా కోసం పావురాలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారని అంటారు.



బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనా కాలంలో రాబర్ట్ క్లైవ్ 1766లో అధికారిక తపాలా వ్యవస్థను ఏర్పాటు చేయగా 1774 తర్వాత వారెన్ హేస్టింగ్స్ చొరవతో ప్రజా సేవలు అందులో చేర్చబడ్డాయి. లార్డ్ డల్హౌసీ ఆధ్వర్యంలో అమలు చేయబడిన 1854 నాటి ఇండియా పోస్ట్ ఆఫీస్ చట్టంతో భారతదేశం అంతటా తపాలా రేట్లను ప్రామాణికం చేయడంతో ఇది భారతదేశ వ్యాప్తంగా మొదటి తపాలా స్టాంపులను ప్రవేశపెట్టేందుకు దారితీసింది. 1852లో భారతదేశంలో (దేశ విభజనకు పూర్వం) సింధ్ ప్రావిన్స్‌లోని సిండే డాక్ స్టాంపుతో ప్రప్రథమంగా జిగురుతో అతుక్కునే తపాలా బిళ్ళలు (పోస్టల్ స్టాంపులు) ప్రవేశపెట్టబడ్డాయి, ఆ తర్వాత 1854లో భారతదేశం అంతటా ఉపయోగం కోసం స్టాంపులతో కూడిన ఏకీకృత, దేశవ్యాప్త తపాలా వ్యవస్థను ప్రవేశపెట్టారు.

1854లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏకరీతి తపాలా రేట్లను ఏర్పాటు చేయగా నాటి తపాలా బిళ్ళలపై క్వీన్ విక్టోరియా చిత్రపటం ఉండేది. ఫిబ్రవరి 18, 1911న ఫ్రెంచ్ వైమానికుడు హెన్రీ పెక్వెట్ హోలీ ట్రినిటీ చర్చిలో కొత్త యూత్ హాస్టల్ కోసం నిధులను సేకరించడానికి యునైటెడ్ ప్రావిన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా 6,500 ఉత్తరాలను చేరవేసేందుకు అలహాబాద్ నుండి 9.7 కిలోమీటర్ల దూరంలో గల నైనికి హంబర్ బైప్లేన్ (ఉక్కు, కలప మిశ్రమంతో తయారు చేయబడిన చిన్న విమానం)లో ప్రయాణించడం ద్వారా భారతదేశపు మొట్టమొదటి అధికారికంగా మంజూరు చేయబడిన ఎయిర్ మెయిల్ డెలివరీ సర్వీసుకు శ్రీకారం చుట్టారు. అయితే, యునైటెడ్ స్టేట్స్ పోస్ట్ ఆఫీస్ ద్వారా మే 15, 1918న న్యూయార్క్, వాషింగ్టన్ డి.సి.(ఫిలడెల్ఫియాలో కొంత విరామం) మధ్య మొదటిసారిగా క్రమం తప్పకుండా షెడ్యూల్ చేయబడిన, శాశ్వత ఎయిర్ మెయిల్ సేవ స్థాపించబడింది. 1931లో భారతదేశంలో తొలిసారి చిత్రాలతో కూడిన తపాలా బిళ్ళలు ప్రవేశపెట్టబడ్డాయి.

కలకత్తా (ప్రస్తుత కోల్‌కతా) రాజధానిగా పాలన కొనసాగిస్తున్న బ్రిటిష్ 1931లో రాజధానిని కొత్త ఢిల్లీకి మార్చినందుకు జ్ఞాపకార్థంగా చిత్రాలతో కూడిన ఆరు స్టాంపులను విడుదల చేసింది. ఈ స్మారక స్టాంపులపై పురానా ఖిలా కోట, ప్రభుత్వ భవనాల చిత్రాలు ముద్రించబడ్డాయి. 1946లో, తూర్పు రాష్ట్రమైన ఒడిశాలో ఇతర మార్గాల ద్వారా చేరుకోలేని మారుమూల ప్రాంతాలలోని పోలీస్ స్టేషన్లను అనుసంధానించడానికి పావురాలతో ఒక ప్రత్యేకమైన తపాలా సేవను ప్రారంభించింది. వరదలు, తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాల సంభవించి సమయాలలో ఈ హోమింగ్ పావురాలు అత్యంత కీలకంగా మారాయి. ఈ పావురాలు వాటి కాళ్లకు అనుసంధానించబడిన చిన్న లోహపు సిలిండర్లలో సందేశాలను మోసుకుని వెళ్ళేవి. ప్రత్యేకించి సుశిక్షితులైన ఈ పావురాలు గంటకు 55 మైళ్ల వేగంతో ప్రయాణించగల సామర్థ్యం కలిగి ఉండేవి. ఏప్రిల్ 1948లో, ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఈ సేవను ఉపయోగించి సంబల్‌పూర్ నుండి కటక్‌కు బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సందేశం పంపారు. 1982, 1999లో తీవ్రమైన తుఫాన్ల కారణంగా ఒడిశా రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు చిన్నాభిన్నమైనప్పుడు కూడా పావురాలు కీలక పాత్ర పోషించాయి. అయితే, మార్చి 2008లో ఒడిశాలో పావురాల ద్వారా తపాలా సేవకు తెర పడింది.

## స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో తపాలా వ్యవస్థ

1947లో స్వాతంత్ర్యానంతరం అప్పటికే అమలులో ఉన్న తపాలా వ్యవస్థను భారత్ బ్రిటిష్ వలసవాద ప్రభుత్వం నుండి తన ఆధీనంలోకి తీసుకోవడంతో భారతదేశ తపాలా సేవల జాతీయీకరణ జరిగింది. ఈ అధికార బదిలీ కేవలం బ్రిటిష్ వారి ఆధీనంలో ఉన్న ఇంపీరియల్ పోస్ట్ నుండి ఆధునిక ప్రభుత్వ యాజమాన్యంలోని 'ఇండియా పోస్ట్'కు మారడమే కానీ ప్రైవేట్ పరిశ్రమతో జరిగే అధికారిక జాతీయీకరణ ప్రక్రియ కాదు.

స్వాతంత్ర్యానంతరం పోస్టల్ సర్వీస్ భారత ప్రభుత్వం బాధ్యతగా మారడంతో గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు పలు విధాల పరివర్తనలకు లోనయ్యింది. భారతదేశం స్వాతంత్రం పొందే సమయానికి, దేశ జనాభాలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు.




1951 జనాభా లెక్కల ప్రకారం మొత్తం దేశ జనాభాలో దాదాపు 82.7 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోను, దాదాపు 17.3 శాతం ప్రజలు పట్టణ ప్రాంతాల్లోను నివసించేవారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, తపాలా సేవలను గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించడంపై ప్రధానంగా దృష్టి సారించిన భారత ప్రభుత్వం 1947లో 23,344గా ఉన్న పోస్టాఫీసుల సంఖ్యను 2016 నాటికి అనూహ్యంగా 155,000కి విస్తరించింది. సెప్టెంబరు 2025 నాటికి, ఇండియా పోస్ట్ నెట్‌వర్క్ 165,000కి పైగా పోస్టాఫీసులతో ప్రపంచంలోనే అతిపెద్ద పోస్టల్ నెట్‌వర్క్ వ్యవస్థగా చరిత్ర సృష్టించింది. ఆగస్టు 15, 1972న ప్రవేశపెట్టబడిన ఆరు అంకెల పిన్ కోడ్ (పోస్టల్ ఇండెక్స్ నంబర్) వ్యవస్థ భారతీయ తపాలా వ్యవస్థలో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించవచ్చు.

కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్న శ్రీరామ్ భికాజీ వేలంకర్ చొరవతో భారతీయ పిన్ కోడ్ వ్యవస్థను ప్రవేశపెట్టగా ఈ వ్యవస్థను దేశవ్యాప్తంగా ఉత్తరాలు, పార్శిళ్ల విభజన (మెయిల్ సార్టింగ్), బట్వాడాను (డెలివరీ) క్రమబద్ధీకరించడానికి ఆగస్టు 15,1972న ప్రవేశపెట్టారు. స్థలాల పేర్లలో సారూప్యత, అక్షర దోషాలు, చిరునామాలలో ఉపయోగించే విభిన్న భాషల వల్ల ప్రాంతాల వారీగా ఉత్తరాలు, పార్శిళ్ల విభజన ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఇది అభివృద్ధి చేయబడింది.

పిన్ కోడ్‌తో విస్తారమైన భౌగోళిక ప్రాంతాలను చిన్న, జోన్‌లు, సబ్‌జోన్‌లు, జిల్లాలు, వ్యక్తిగత పోస్టాఫీస్ ప్రాంతాలుగా విభజించడంతో పోస్టల్ కార్మికులు, ఆటోమేటెడ్ సిస్టమ్‌లు మెయిల్ గమ్యస్థానాన్ని త్వరితగతిన గుర్తించి సంబంధిత ప్రాంతీయ కార్యాలయానికి తరలించేలా మొత్తం విభజన ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ప్రతి పిన్ కోడ్ నిర్దిష్ట డెలివరీ పోస్టాఫీసుకు ప్రత్యేకమైనది కావడంతో స్థలాల పేర్లలో సారూప్యత, అక్షర దోషాలు, చిరునామాలలో ఉపయోగించే విభిన్న భాషల వల్ల కలిగే అస్పష్టతను ఇది చాలా వరకు కట్టడి చేయగలిగింది. దాదాపు ఐదున్నర దశాబ్దాల 'పిన్ కోడ్' మనుగడ అనంతరం, దాని కొన్ని పరిమితుల దృష్ట్యా, మే 27, 2025న దేశవ్యాప్తంగా ప్రతి 44 చదరపు మీటర్ల ప్రాంతానికి 10 సంఖ్యల అంకెలు, అక్షరాల గుర్తింపును (ఆల్ఫాన్యూమరిక్ ఐడెంటిఫైయర్) ఉపయోగించే 'డిజిపిన్' అనే 'డిజిటల్' అడ్రస్ వ్యవస్థను ప్రవేశపెట్టారు.

పెద్ద నగరాల నుండి మారుమూల గ్రామాల వరకు ప్రతి భారతీయుడిని అనుసంధానించడానికి ఇండియా పోస్ట్ అత్యధిక పోస్టాఫీసులు గ్రామీణ ప్రాంతాలలో విస్తరించబడ్డాయి. ఆధునీకరణలో భాగంగా మే 2025లో ఇండియా పోస్ట్ ఒక ప్రధాన సాంకేతిక ప్రాజెక్టును ప్రారంభించడం గమనార్హం. ఆగస్టు 4,2025 నాటికి, మెరుగైన కార్యకలాపాలు, లావాదేవీలు, ఎండ్ టు ఎండ్ ట్రాకింగ్ కోసం మొత్తం నెట్‌వర్క్ కొత్త 'ఆటోమేటెడ్ పోస్టల్ టెక్నాలజీ' (APT) వ్యవస్థలో విలీనం చేయబడింది.

## పోస్ట్ కార్డ్, ఇన్‌లాండ్ లెటర్

ప్రజలకు చౌకైన, అనుకూలమైన సమాచార మాధ్యమంగా భారతదేశంలో జూలై 1, 1879న పావు అణాకు (ఒక్క అణాకు ఆరు పైసలు) మొదటి పోస్ట్‌కార్డ్‌ను ప్రవేశపెట్టింది. ఫోన్లు, ప్రజా రవాణా వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని సమయంలో పోస్ట్ కార్డ్‌ను ప్రజలు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు విరివిగా ఉపయోగించేవారు. పోస్ట్ కార్డ్‌లతో సమానంగా ఉండేలా కొత్త పోస్టల్ స్టేషనరీ వస్తువుగా అక్టోబర్ 2, 1950న భారతదేశంలో 'ఇన్‌లాండ్ లెటర్' ప్రవేశపెట్టబడింది. మడతపెట్టే ఈ కాగితపు ఉత్తరంపై చిరునామాను రాసి, ఆపై మడతపెట్టి కవరు లాంటి రూపంలోకి సీలు చేస్తారు. ఇది లేఖలు పంపడానికి చౌకైన ఎంపికగా మారింది.

## మనీ ఆర్డర్

భారతదేశంలో 1880లో ప్రారంభించిన సాంప్రదాయ మనీ ఆర్డర్ సేవలు ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లు, ఇంటర్నెట్, డిజిటల్ చెల్లింపు పద్ధతుల పెరుగుదలతో ఈ వ్యవస్థను ఏప్రిల్ 2015లో ఇండియా పోస్ట్ నిలిపివేసింది. ఒకప్పుడు దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు తమ కుటుంబాలకు, ఇతర ప్రదేశాల్లో చదువుకునే తమ పిల్లలకు తల్లిదండ్రులు మనీ ఆర్డర్ మాధ్యమం ద్వారానే డబ్బులు పంపేవారు. సాంప్రదాయ, కాగితం ఆధారిత మనీ ఆర్డర్ సేవలు ముగిసినప్పటికీ, నిధులను బదిలీ చేయడానికి ఆధునిక, వేగవంతమైన ప్రత్యామ్నాయాలుగా ఇండియా పోస్ట్ ఎలక్ట్రానిక్, తక్షణ మనీ ఆర్డర్ సేవలను అందిస్తూనే ఉంది.

## టెలిగ్రామ్

భారత తపాలా, టెలిగ్రాఫ్ విభాగం 1854లో టెలిగ్రామ్ సేవను, 1960లో ట్రంక్ కాల్ సేవను ప్రవేశపెట్టింది. 1850లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో మొట్టమొదటి ప్రయోగాత్మక విద్యుత్ టెలిగ్రాఫ్ లైన్‌ను కోల్‌కతా (అప్పటి కలకత్తా), డైమండ్ హార్బర్ మధ్య ప్రారంభించింది.



1960లో మొట్టమొదటిసారి లక్నో, కాన్పూర్ మధ్య మొదటి సబ్‌స్క్రైబర్ ట్రంక్ డయలింగ్ వ్యవస్థ ప్రారంభించబడడంతో వినియోగదారుడు ఆపరేటర్ సహాయం లేకుండా నేరుగా సుదూర నంబర్‌కు డయల్ చేయడానికి వీలు ఏర్పడింది. 1980వ దశకంలో ట్రంక్ కాల్స్, టెలిగ్రాఫ్ సేవలు ముందు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్స్‌కు ఆ తరువాత 2000 సంవత్సరంలో భారత్ సంచార్ నిగం ఏర్పాటు తరువాత బిఎస్ఎన్ఎల్‌కు బదిలీ చేయబడ్డాయి. కాగా, ట్రంక్ కాల్స్‌తో సహా 160 యేళ్ల నాటి టెలిగ్రాఫ్ సేవలను బిఎస్ఎన్ఎల్ జూలై 15, 2013న నిలిపివేసింది.

దేశవ్యాప్తంగా టెలిగ్రాఫ్ లైన్లు వేసిన తర్వాత, ఏప్రిల్ 1854లో మొదటి టెలిగ్రామ్ ముంబై (అప్పటి బొంబాయి) నుండి పూణేకు పంపడం ద్వారా ఈ సేవను అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. అత్యవసర వ్యక్తిగత, అధికార సమాచారం చేరవేత కోసం సైనికులు, సాధారణ ప్రజలు, ప్రభుత్వ, వాణిజ్య, వ్యాపార సంస్థలు టెలిగ్రాం సేవలను విరివిగా ఉపయోగించుకునేవారు. అయితే, ఆధునిక సాంకేతిక విప్లవంతో ఈ సేవలకు ఆదరణ కొరవడి ఆదాయం గణనీయంగా తగ్గడంతో 14 జూలై 2013న టెలిగ్రామ్ సేవలు అధికారికంగా నిలిపివేయబడ్డాయి.

## ట్రంక్ కాల్

సుదూర కాల్స్ చేయడం కోసం భారతదేశంలో టెలిఫోన్ ఆపరేటర్ సహాయంతో, బహుళ దశల ప్రక్రియతో కూడిన 'ట్రంక్ కాల్' సౌకర్యం అందుబాటులో ఉండేది. ట్రంక్ కాల్ కోసం వినియోగదారులు ముందుగా స్థానిక ఆపరేటర్‌తో సాధారణ లేదా అత్యవసర కాల్ బుక్ చేసుకోవాలి. కాల్ రకం ఆధారంగా తరువాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లోని ఆపరేటర్ లైన్‌ను వేరే నగరంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కు మాన్యువల్‌గా కనెక్ట్ చేస్తారు.

ట్రంక్ కాల్ కనెక్ట్ అవ్వడానికి నిమిషాల నుండి చాలా గంటల వరకు లేదా పూర్తి రోజు కూడా పట్టేది. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో, వాతావరణం అనుకూలంగా లేని సమయాలలో ఇది ఒక ప్రహసనంగా మారేది. తక్కువ ఖర్చుతో కూడుకున్న 'సాధారణ' రకం కాల్ కోసం ఎక్కువ కాలం వేచి ఉండాల్సి వచ్చేది. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న 'అత్యవసర' రకం కాల్ కోసం వేచి ఉండే సమయం తక్కువగా ఉండేది. ట్రంక్ కాల్ బుకింగ్‌లో 'ప్రత్యేక వ్యక్తి' (Particular Person-PP) సౌకర్యం అందుబాటులో ఉండేది. ఈ రకమైన బుకింగ్ చేసినప్పుడు నిర్దిష్ట వ్యక్తి అవతలి వైపు ఉన్నట్లు నిర్ధారించబడినప్పుడు మాత్రమే ఆపరేటర్ కాల్‌ను కనెక్ట్ చేసేవారు.



## ఆధునీకరణ

జాతీయీకరణ తర్వాత, ముఖ్యంగా ఇటీవలి దశాబ్దాలలో, ఇండియా పోస్ట్ సాంప్రదాయ తపాలా సేవలతో పాటు ఆధునిక ఆర్థిక, బ్యాంకింగ్, బీమా, ఇ కామర్స్ సేవలను కూడా అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న తన విస్తారమైన పోస్టాఫీసుల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటూ, ఇండియా పోస్ట్ తన కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడంతో పాటు ఆర్థిక, లాజిస్టిక్స్ సేవలను తన సేవల జాబితాలో చేర్చుకుంది.

బ్యాంకింగ్, ఆర్థిక సేవలలో భాగంగా 2018లో ప్రారంభించబడిన ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) ద్వారా తన ఖాతాదారులకు పొదుపు, కరెంట్ ఖాతాలు, డబ్బు బదిలీలు, బిల్లు చెల్లింపులు లాంటి పలు సేవలను అందిస్తోంది. ఇది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ బ్యాంకింగ్‌ను అందించడానికి పోస్టల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటుంది, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) వంటి ప్రభుత్వ చొరవలకు మద్దతు ఇస్తుంది. తన సేవింగ్స్ ఖాతాదారుల కోసం ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభించడానికి ఈ విభాగం కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (సిబిఎస్)ను అమలు చేసింది. దీని వలన ఇండియా పోస్ట్ ఖాతాదారులు నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఇఎఫ్టి), రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్టిజిఎస్) ఉపయోగించి పోస్టాఫీసు, బ్యాంక్ ఖాతాల మధ్య ఎలక్ట్రానిక్ రూపంలో నిధుల బదిలీ సేవలను పొందవచ్చు.

పోస్టాఫీసులు ఎటిఎం సేవలను అందించడంతో పాటు బ్యాంకింగ్ సేవలను తమ ఎటిఎంల ద్వారా పొందేందుకు కూడా అనుమతిస్తోంది.

ఐపిపిబి సేవలలో భాగంగా తన ఖాతాదారులకు ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం)ను అందిస్తోంది. ఇది బ్యాంకింగ్ లావాదేవీల కోసం ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగిస్తుంది. ఖాతాదారులు పాస్‌బుక్ సౌకర్యాన్ని ఉపయోగించి వారి ఖాతాలో బ్యాలెన్స్, మినీ స్టేట్‌మెంట్‌ను ఆన్‌లైన్‌లో వీక్షించవచ్చు.

1995లో ప్రవేశపెట్టబడిన గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్‌పిఎల్‌ఐ) పథకం గ్రామీణ జనాభాకు జీవిత బీమా కవరేజీ అందించడం ద్వారా బలహీన వర్గాలు, మహిళా కార్మికులకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. భారత ప్రభుత్వ భాగస్వామిగా ఇండియా పోస్ట్ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై) వంటి పథకాలను అందిస్తోంది. 1986లో ప్రారంభించబడిన స్పీడ్ పోస్ట్ సేవ ద్వారా లేఖలు, పార్శిళ్లు, పత్రాల వేగవంతమైన డెలివరీని అందిస్తుంది. ఇకామర్స్ పోర్టల్ ద్వారా ఇండియా పోస్ట్ విక్రేతలకు, ముఖ్యంగా గ్రామీణ కళాకారులు, చిన్న వ్యాపారాలకు ఇమార్కెట్ ప్లేస్‌ను అందిస్తుంది. ఇది పోర్టల్ ద్వారా కొనుగోలు చేసిన ఉత్పత్తులకు డెలివరీ, రిటర్న్ సేవలను కూడా అందిస్తుంది.




ఆన్‌లైన్ వ్యాపారాల కోసం ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పరిష్కారాలను అందించడానికి ఇండియా పోస్ట్ షిప్రోకెట్, ఒఎన్డిసి వంటి ఇకామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో సహకరిస్తుంది. మెరుగైన సామర్థ్యం కోసం మెయిల్, పార్శిల్ ఆప్టిమైజేషన్ ప్రాజెక్ట్ (MPOP) రియల్‌టైమ్ ట్రాకింగ్, SMS నోటిఫికేషన్‌లు, సిస్టమ్ సహాయక సార్టింగ్‌ను ప్రవేశపెట్టింది. ఇండియా పోస్ట్, ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ సర్వీస్.. సహా ఇకామర్స్ ఎగుమతిదారులకు పోటీ షిప్పింగ్ రేట్లతో అనేక భాగస్వామ్య దేశాలకు ట్రాకింగ్‌తో మద్దతు ఇస్తుంది. డాక్ ఘర్ నిర్యత్ కేంద్రం (DNK) చొరవ ద్వారా ఇండియా పోస్ట్ చిన్న, మధ్య తరహా ఎగుమతిదారులు ఆన్‌లైన్ ఆర్డర్‌లు, డాక్యుమెంటేషన్, కస్టమ్స్ క్లియరెన్స్ ప్రక్రియలలో సహాయం అందిస్తుంది. ఈ వాణిజ్య సేవలతో పాటు పౌరుల కోసం ఇండియా పోస్ట్ ఆధార్ నమోదు, నవీకరణ సేవలు, విదేశాంగ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో కొన్ని పోస్టాఫీసులు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలుగా సేవలు అందిస్తున్నాయి. వృద్ధాప్య పెన్షన్ చెల్లింపులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులకు పోస్టాఫీసులు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం(Mahatma Gandhi National Rural Employment Guarantee Act) వేతనాలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలను పంపిణీ చేస్తోంది.




1873 ప్రభుత్వ పొదుపు బ్యాంకు చట్టం ఏర్పాటైన తరువాత ఏప్రిల్ 1, 1882న భారతదేశంలో బొంబాయి, మద్రాస్, బెంగాల్ ప్రెసిడెన్సీలలో కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంకులు ప్రారంభించబడ్డాయి. బ్రిటిష్ రాజ్ చేసిన ఈ చొరవ పొదుపు ఉద్యమాన్ని విస్తరించి, జనాభాకు సేవ చేయడానికి పొదుపు బ్యాంకుల నెట్‌వర్క్‌ను సృష్టించింది. ఇండియా పోస్ట్ తన ఐకానిక్ 'బుక్ పోస్ట్' సేవను నిలిపివేసింది, ఇది పుస్తక ప్రియులు భారతదేశంలో ఎక్కడికైనా ఐదు కిలోల పుస్తకాలను రూ.100 కంటే తక్కువ ధరకు రవాణా చేయడానికి వీలు కల్పించే తక్కువ ఖర్చుతో కూడిన చొరవ.

ప్రైవేట్ ప్లేయర్లు ఆధిపత్యం చెలాయించే అభివృద్ధి చెందుతున్న కమ్యూనికేషన్ ల్యాండ్‌స్కేప్‌లో ఇండియా పోస్ట్ కార్యకలాపాలలో మార్పుల మధ్య ఈ మూసివేత వచ్చింది. డిసెంబర్ 18న, నిశ్శబ్దంగా కానీ తీవ్రమైన మార్పు భారతదేశ సాహిత్య దృశ్యాన్ని కుదిపేసింది. సరసమైన జ్ఞాన భాగస్వామ్యానికి మూలస్తంభంగా ఉన్న సబ్సిడీ చొరవ అయిన ఇండియా పోస్ట్ తన ప్రియమైన 'బుక్ పోస్ట్' సేవను అకస్మాత్తుగా నిలిపివేసింది. రూ.100 కంటే తక్కువ ధరకు, పుస్తక ప్రియులు దేశంలో ఎక్కడికైనా ఐదు కిలోల వరకు పుస్తకాలను రవాణా చేయవచ్చు, ఇది ఏ కొరియర్ ప్రత్యామ్నాయంతోనూ సరిపోలని సేవ. ఈ నిర్ణయం పాఠకులను, ప్రచురణకర్తలను దిగ్భ్రాంతికి గురిచేసింది.

"బుక్ పోస్ట్ ఇండియా పోస్ట్ లాగానే, మన సాంస్కృతిక వారసత్వంలో అల్లుకుంది. దానిని కోల్పోవడం మన వారసత్వంలోని ఒక ముఖ్యమైన అధ్యాయాన్ని చెరిపివేస్తుంది" అని ఒక చరిత్రకారుడు అన్నారు. ఇండియా పోస్ట్ అభివృద్ధి చెందుతున్న కమ్యూనికేషన్ ల్యాండ్‌స్కేప్‌ను నావిగేట్ చేస్తున్నప్పుడు దాని కార్యకలాపాలలో మార్పుల మధ్య ఈ మూసివేత వచ్చింది. ఒకప్పుడు కనెక్టివిటీ, విశ్వసనీయతకు చిహ్నంగా ఉన్న ఇది ఇప్పుడు ప్రైవేట్ సంస్థలతో పోటీ పడటానికి కష్టపడుతోంది. ఇంకా, సెప్టెంబర్ 1, 2025 నాటికి, ఇండియా పోస్ట్ దాని 'రిజిస్టర్డ్ పోస్ట్' సేవను నిలిపివేసింది, పోస్టల్ సేవను ఆధునీకరించడానికి దానిని 1986లో ప్రవేశపెట్టిన 'స్పీడ్ పోస్ట్'లో విలీనం చేసింది.

# ఆ చెలి జ్ఞాపకం

ఎలా ఉండగలను.. ఆ చెలిపై
కవితల తేనె జల్లును కురిపించకుండా!
ఎలా ఉండగలను వర్ణనా తీతమైన
సువర్ణ కాంతుల
పసిడిమేను ఛాయపై
కవిత రాయకుండా!
వెండి తీగలోలె మిల మిల మెరిసే
ఆ కురుల హొయలలో
మేఘమాల
సాయంతో
విరబూసిన
పువ్వుల
మాలల్ని
హారతిగజేసి
ఆ చెలికి పంపాలని వీచే పవనాలను
అడిగాను..
ప్రకృతంతా సయ్యంటే సయ్యన్నది
ఆ చెలి వెనకాలున్న గున్న
మామిడితో సహా
ఆ చక్కని చిక్కని చెక్కిళ్ళు
చూస్తుంటే
ఆ చెక్కిలిపై ఓ చక్కని చిక్కని
దిష్టిచుక్కనైపోవాలని
పెదవులపై చల్లని చిరునవ్వు
నా హృదయంలో చెరగని
ముద్రగా నిలిచెకదా..
ఆ పలువరుసలకు కలువలు
సైతం
వెలవెల బోయినట్లున్నవి కదా..
ఆ చెలి జ్ఞాపకాల దొంతర్లు
కవితల మాలలై
మధురానుభూతులు
పంచుతాయని
ఎన్నడైనా ఊహించానా
ఊహలకే ఊపిరొస్తుందని
ఎప్పుడైనా అనుకున్నానా...
పరిమళాలు వెదజల్లే
ఆ చెలి మేను సువాసన
వెన్నెల సుమపాతమై
మనసుకి హాయిని కలిగిస్తుందని
నేనెన్నడు ఊహించలేదు
ఇంకేమని వర్ణించను..
నా చెలిని ఆ చెలిని
చందమామ కంటే చల్లగా
నవ్వుల పువ్వుల వెన్నెల
కురిపించే
ఆ చెలిమనసు నిర్మలత్వం
ఈ కవి హృదికి కాక ఇంకెవరికి
తెలుసు

– డా॥ కొరుప్రోలు హరనాథ్



# కొందరు వ్యక్తులు

ముచ్చట్లపై ముచ్చట్లు పెడుతుంటారు
మరి,
కానీ ఎప్పుడూ ఎన్నటికీ ఒక్క
విషయమూ చెప్పరు!
కొందరు వ్యక్తులు...
నీ వైపు చూస్తుంటారు అంతే మరి,
పక్షులు పాడడం మొదలు
పెడుతాయి!
కొందరు వ్యక్తులు...
నవ్వులపై నవ్వులు చిందిస్తుంటారు
మరి,
అయినా నీవు కెవ్వుమని
ఏడ్వాలనుకుంటావు!
కొందరు వ్యక్తులు...
నీ చేయిని స్పృశిస్తారు అంతేమరి..
ఆ స్పర్శతో సంగీతం ఆకాశమంతా
నిండిపోతుంది !!!

ఆంగ్లమూలం: శార్లట్ జోలోటో
అనువాదం: రఘువర్మ



ఈ వారం కవిత్వం

# సువిశాల విశ్వంలో..



మేలిమాటై మేలు పలికేనోట
జాలి హితమై జాలువారే చోట
ప్రతిఫలాక్షలేక చూపే బాట
ప్రతిఫలంగా మోయలేనంత హాయి.
నచ్చడం బాగా నచ్చడం
బాగా బాగా నచ్చడం
మెచ్చడం చాలా మెచ్చడం
చాలా చాలా మెచ్చడం
నవ్వడం
ఇంకా
నవ్వడం
ఇంకా
ఇంకా నవ్వడం
నమ్మడం ఎంతో నమ్మడం
ఎంతో ఎంతో నమ్మడం
ఇవ్వడం నిస్వార్థంగా
ఇవ్వడం
ఎదగమని ఇవ్వడం
ఎప్పుడైనా ఎక్కడైనా
ఎవ్వరికైనా స్ఫూర్తిదాయకం
లోకంలో నువ్వొకడివి
లోకుల అనుభవాలు
ప్రతిక్షణం పాఠ్యాంశాలు
లోకం నిన్ను పట్టించుకోదని
లోకాన్ని నువ్వు విస్మరించకు
ప్రతినిత్యం పైకమైనా లోకం
ప్రతిక్షణం మైకమైనాలోకం
కనిపించని లోపమైనా లోకం
వినిపించే శోకమైనా లోకం
మోసాలను గుండెల్లో మోస్తూ మోస్తూ
మొక్కేవాళ్లను తొక్కేస్తుంది.
అందుకే అనుక్షణం జాగ్రత్తగా
ఎన్నెన్ని మెట్లు ఎక్కామని కాక
వాటిని విస్మరించకపోవడం
మనిషినెంతో మర్యాదగా వుంచుతుంది
మనుగడలో మహదానందాన్ని
పంచుతుంది.

– డా॥ కొల్లు రంగారావు

సింగిల్ పేజీ కథ

# ముద్రలు



"మమ్మీ! నేను వరండాలో ఆడుకుంటాను".

"ఆన్ లైన్లో ఆఫీసు పనిలో బిజీగా ఉన్న ఆమె ఓకే! ఓకే!!." అంటూ తలూపడం చూసింది పిల్ల.

"లంచ్ సమయం అవుతోంది. ఇప్పుడు ఆటలేంటి? ఎక్కడకూ వెళ్ళొద్దు" అంది నాన్నమ్మ.

నాన్నమ్మ మాటలకు పిల్ల తల్లి వైపు చూసింది.

ఆమెకు పరిసరాల ధ్యాస లేదు. ఆఫీసు పనిలో నిమగ్నమై వుంది.

"మమ్మీ ఓకే! అంది. లంచ్ సమయానికి వచ్చేస్తా!"

మనవరాలి మాటలకు నాన్నమ్మ విసుక్కుంది.

"వద్దని చెప్పానా!" కోపంగా అంది.

అప్పుడే తండ్రి గదిలోంచి వచ్చారు. "సెలవులు కదమ్మా! పక్కింటి పిల్లలు ఆడుకుంటున్నారుగా. కాసేపు వాళ్ళతో ఆడుకోనీ!" అన్నాడు.

"థాంక్యూ డాడీ!" అంటూ పిల్ల వెళ్లిపోయింది.

మనవరాలు వరండాలోకి వెళ్తూ చూసిన చూపుకి, కొడుకు మాటలకు తల్లి బాధపడింది.

................

"గుడ్ మార్నింగ్ పిల్లలూ! అంటే శుభోదయం అన్న మాట! ఈరోజు మీకు మంచి పనులు గురించి, మంచి మాటల గురించి చెబుతాను" మూడో క్లాసు తెలుగు టీచరు చెప్పారు.

పిల్లలు గుడ్ మార్నింగ్ చెప్పారు. "అలాగే టీచర్!" అన్నారు. "తరగతి గదిలోగానీ, స్కూలు పరిసరాలలోగానీ పెన్సిళ్ళు, పెన్నులు, మరేవైనా వస్తువులు దొరికితే, ఏం చేయాలో చెబుతాను..వినండి"

టీచర్ చెప్పే విషయం పిల్లలు ఆసక్తిగా వింటున్నారు. "ఆ వస్తువులు పోగొట్టుకున్న వారికి అందజేయడం మంచి పని. అలా చేయకపోవడం చెడ్డ పని" అంది.

"అర్థం అయింది టీచర్!"

"పెద్దలు పిల్లల బాగుకోసం చెప్పే మంచి మాటలు వినాలి. ఆచరించాలి. అలా చేయడం చాలా మంచిది. మాట వినకపోతే పెద్దలకు కోపం వస్తుంది. అవునా? కాదా?"

"అవును టీచర్! పిల్లలు పెద్దలు చెప్పిన మాటలు వినాలి" పిల్లల మాటలకు టీచరు సంతోషించారు.

"టీచర్! మాకు ఒక సందేహం.. అమ్మొక మాట, నాన్నొక మాట, నాన్నమ్మ ఒకమాట చెబితే ఎవరి మాట వినాలి?"

ఊహించని ఆ ప్రశ్నకు టీచరు అవాక్కయారు. కొన్నినిమిషాలు ఆ పిల్లను తదేకంగా చూస్తుండిపోయారు.

"తలోమాట చెప్పడం మంచిది కాదు.." అంది టీచర్.

ఇంతలో బెల్ మోగింది. క్లాసు సమయం ముగిసింది.

"నీ ప్రశ్నకు సమాధానం విరామ సమయంలో నా గదికి వస్తే వివరంగా చెబుతాను"

"అలాగే టీచర్!"

................

పిల్ల చెప్పింది విన్న టీచరు నవ్వుతూ చెప్పారు "మమ్మీ ఆఫీసు పని విషయంలో, ఎవరితోనో మాట్లాడుతూ ఓకే! అని వుండవచ్చు. ఆడుకోమని చెప్పడానికి కాకపోవచ్చు.

మీ నాన్నమ్మ లంచ్ సమయంలో ఆటలు వద్దంది. లంచ్ సమయం దాకా డాడీ నీ మీద ప్రేమతో ఆడుకోమని చెప్పారు. అందరికీ నీవంటే అమితమైన ప్రేమని తెలుసుకోవాలి నీవు. వారు టైముకి లంచ్ చేయమనే కదా చెప్పారు?"

"అవును టీచర్! అందరికీ నేనంటే ప్రేమే!" అంటూ పిల్ల వెళ్ళిపోయింది.

"పిల్లలకు ఇది చాలా సున్నితమైన సమస్య. పేరెంట్స్ మీటింగులో ప్రిన్సిపాల్ మేడం ద్వారా అందరికీ అర్థం అయ్యేలా, జనరల్‌గా ఈ సమస్య గురించి తెలియజేయాలి.

ఆ పిల్ల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా విషయాన్ని వివరించాలి. పిల్ల పడుతున్న మానసిక సంఘర్షణ గురించి వివరంగా తెలియచెప్పాలి. లేకుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావొచ్చు. పిల్లల సున్నితమైన మనసులపై చెరగని ముద్రలు వేయొచ్చు. వారి భవిష్యత్తుపై ప్రభావం చూపించొచ్చు" స్వగతంలా అనుకున్నారు టీచరు.

**- సుస్మితా రమణమూర్తి**

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# లైఫ్ సేవింగ్ ఎల్ఇడి టార్చ్‌లైట్

ఒకప్పుడు రాత్రివేళల్లో బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు అంతగా లైట్లు లేని ప్రాంతాల్లో చేతిలోని టార్చిలైట్ ఎంతో ఉపయోగపకరంగా ఉండేది.

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగాక వాటికి టార్చిలైట్ ఉండడంతో విడిగా టార్చిలైట్ వాడటం అనేది చాలా వరకు తగ్గిపోయింది. అయితే లైఫ్ సేవింగ్ ఎల్ఇడి టార్చిలైట్ అలాంటి ఇలాంటి టార్చ్ కాదు. ఇది టార్చ్‌లైట్‌గానే కాక సేఫ్టీ కిట్‌గా కూడా పనిచేస్తుంది.

ఈ కాంపాక్ట్ రీచార్జబుల్ టార్చ్‌లైట్ చీకట్లో దారి చూపడానికే కాకుండా ప్రాణాలు కాపాడగల సామర్థ్యం ఉన్న పరికరం ఇది. ఈ టార్చ్‌కు గ్లాస్ బ్రేకర్, సీట్‌బెల్ట్ కట్టర్ కూడా ఇందులో ఉన్నాయి. ప్రమాదవశాత్తు కారులో చిక్కుకుపోతే సీట్‌బెల్టు కట్ చేయడానికి, గ్లాస్ పగులగొట్టడానికి పనికివస్తుంది. ఇది మూడు రకాల లైట్ మోడ్స్‌తో వస్తుంది. ఎంత కావాలో అంత లైటింగ్‌ను సెట్ చేసుకోవచ్చు.



ఎమర్జెన్సీలో ఎవరికైనా సిగ్నల్ ఇవ్వాల్సి వస్తే అందుకు దీనిలోని స్ట్రోబ్ మోడ్ బాగా పనిచేస్తుంది. ఇది ఒక పవర్‌ఫుల్ ఎల్ఇఇ లైట్‌తో వస్తుంది. దీన్ని చీకటి ప్రదేశాల్లో, అత్యవసర పరిస్థితుల్ల వాడవచ్చు. రీఛార్జబుల్ బ్యాటరీ ఉండటం వల్ల డిస్పోజబుల్ బ్యాటరీల అవసరముండదు.

# స్టార్‌షిప్ ల్యాంప్

ఒకప్పుడు ఇంటివసారాలోనో, లేక డాబా మీదనో పడుకుని ఆకాశం వైపు చూస్తూ కబుర్లు చెప్పుకుంటూ నక్షత్రాలు, చంద్రున్ని చూస్తూ పడుకునేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితులు చాలా.. చాలా.. తక్కువనే చెప్పాలి. ఉద్యోగాలు, ఇతరత్రా కార్యకలాపాలతో నిద్రాసమయం చాలావరకు తక్కువే అయింది. బెడ్ మీద వాలాక ఎప్పుడోగాని నిద్ర పట్టదు. లేవడం కూడా ఆలస్యమే. ఇది సాధారణవిషయమిప్పుడు.



అది అలా ఉంటే బెడ్‌రూమ్‌లోనే ఉండి ఆకాశంలో ఉన్న అనుభూతిని పొందవచ్చు. ఎలా అంటారా? ఆ అనుభూతిని ఆస్వాదించేందుకు స్టార్‌షిప్ ల్యాంప్ తోడ్పడుతుంది. స్టార్‌షిప్ ల్యాంప్ ఆన్‌చేస్తే గది గోడలమీద నక్షత్రాలు, చంద్రుడు, మేఘాలు, గ్రహాలు అన్నీ మెరిసిపోతూ కనిపిస్తాయి. గదినే గగనమండలం చేస్తాయి.

ఇందుకు సంబంధించిన యాప్‌ను మొబైల్‌కు కనెక్ట్ చేసుకుని కలర్స్, బ్రైట్‌నెస్, స్పీడ్ మార్చుకోవచ్చు. ఇంకో విషయమేమిటంటే టైమర్ సెట్ చేస్తే ఒక సమయం తరువాత దానంతట అదే ఆగిపోతుంది. పిల్లల బెడ్‌రూమ్‌లో ఈ దృశ్యాన్ని ఏర్పాటు చేస్తే అల్లరి చేయకుండా నిద్రపోతారు. భలేగా ఉంది కదూ!

# క్రాస్ టవర్స్

బహుళ అంతస్తుల బిల్డింగ్‌లు సాధారణంగా పొడవుగా లేదా అడ్డంగా నిర్మిస్తారు. దక్షిణ కొరియాలో నిర్మించిన ఒక భవనం ఒకదాన్నొకటి క్రాస్ చేస్తున్నట్లుగా నిర్మించారు. అందుకే దీన్ని క్రాస్‌టవర్స్ అంటారు.

ఈ భవనాన్ని డానిష్ ఆర్కిటెక్ట్ సంస్థ నిర్మించింది. ఒకదానికొకటి ఎదురుగా ఉండేలా, వాటి మధ్యలోని కొన్ని గదులు ఒకదానితో ఒకటి కలిసేలా డిజైన్ చేశారు. ఇది బయట నుంచి చూడటానికి హ్యాష్‌ట్యాగ్‌లా కనిపిస్తుంది. అందుకే దీన్ని హ్యాష్‌టాగ్ టవర్స్ అని కూడా అంటారు. గాలి, సూర్యరశ్మి భవనంలోకి ధారాళంగా వచ్చేలా దీన్ని నిర్మించారు. దాంతో విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుందని. ఈ బిల్డింగ్‌లలో ఆఫీస్‌లు, మాల్స్, అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి.



# ప్రపంచంలో వ్యక్తిగత రూపాలు

**మనిషి జీవన విధానం అనేది సమాజపు క్రమాన్ని అనుసరిస్తూ మారుతూ ఉంటుంది. ఒక దశలో సమూహ భావన బలంగా నిలిచినా, కాలక్రమంలో వ్యక్తిత్వం అనే కొత్త మార్పు మనిషి మనస్సులో చోటు చేసుకుంది. గతంలో కుటుంబం, వంశం, సమాజం.. అనే పదాలు ఒక మనిషి జీవనాన్ని నిర్వచించేవి.**

కానీ ఆధునిక కాలంలో ఒక వ్యక్తి తన ప్రత్యేకతను, స్వేచ్ఛను, స్వతంత్ర ఆలోచనలను ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ మార్పుకు విద్య, పట్టణీకరణ, సాంకేతిక పరిణామం, వృత్తి స్వరూపం అన్నీ ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఇక్కడ వ్యక్తి తనకున్న ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశాలు పెరిగాయి. తన స్వంత కలలను నెరవేర్చుకోవాలనే కోరిక బలపడింది. అందువల్లే వ్యక్తిత్వం అనే భావన ప్రతి దేశంలో ఒక ప్రత్యేకమైన రూపాన్ని సంతరించుకుంది.

ఎక్కడైతే కుటుంబ అనుబంధాలు గట్టిగా ఉన్నాయో అక్కడ వ్యక్తిగతం పరిమితమైనదిగా ఉంటుంది. స్వేచ్ఛ ఎక్కువగా ఉన్న చోట అది అత్యధికంగా పటిష్ఠమై ఉంటుంది. ఈ రెండు ధోరణుల మధ్య తేడా మనకు వివిధ దేశాల్లో స్పష్టంగా కనబడుతుంది. భారతదేశం కూడా ఈ ప్రభావం నుంచి మినహాయింపు కాదు. మన దేశంలో సంప్రదాయాలు బలంగా ఉన్నప్పటికీ వ్యక్తిగత స్వేచ్ఛపై ఆసక్తి క్రమంగా పెరుగుతూనే ఉంది. ఇది ఒక సాంస్కృతిక మార్పు, సామాజిక మార్పు, వ్యక్తిగత ప్రయాణం అన్నీ కలిసినదే.



**అమెరికా** లాంటి దేశాలలో వ్యక్తిగత జీవన శైలికి మూలాధారం. అక్కడ ఒక వ్యక్తి తన విద్యలో, ఉద్యోగంలో, కుటుంబ నిర్ణయాలలో, రాజకీయ అభిప్రాయాలలో తనకు నచ్చిన దారిని ఎంచుకోవడంలో పూర్తి స్వేచ్ఛ పొందుతాడు. ఒక చిన్న పిల్లవాడు బాల్యం నుండే అక్కడ స్వతంత్రతకున్న ప్రాధాన్యం నేర్పిస్తారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు తమ ఇష్టాలను అనుసరించే అవకాశాలను ఇస్తారు. ఈ స్వేచ్ఛతోనే అమెరికాలో సృజనాత్మకత, ఆవిష్కరణ, కొత్త ఆలోచనలు విస్తారంగా ఎదిగాయి. వ్యక్తిగత ప్రతిభను ప్రోత్సహించే సమాజం కావడంతో ప్రతి ఒక్కరూ తమదైన రంగంలో ప్రత్యేకత సాధించడానికి శ్రమిస్తారు. అయితే ఈ స్వేచ్ఛ కొన్నిసార్లు ఒంటరితనాన్ని, కుటుంబ బంధాల సడలింపును కూడా కలిగిస్తుంది. అయినప్పటికీ అమెరికన్ సంస్కృతి వ్యక్తిగతను ఒక ప్రధాన స్తంభంగా నిలిపింది.

**భారతీయ** సమాజంలో అయితే ఈ విధానాన్ని పూర్తిగా అనుసరించడం సాధ్యం కాదు. ఎందుకంటే ఇక్కడ సమాజపు బంధాలు, కుటుంబ విలువలు ఇంకా బలంగానే ఉన్నాయి. అయినప్పటికీ యువతలో ఒక కొత్త మార్పు మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. వారు తమ స్వంత అభిప్రాయాలను నిలబెట్టుకోవడంలో వెనుకాడటం లేదు.

**జపాన్‌లో** పరిస్థితి కొంచెం భిన్నంగా ఉంటుంది. అక్కడ సమూహ భావన, క్రమశిక్షణ, పరస్పర సహకారం సాంప్రదాయంగా అత్యంత ప్రాముఖ్యంగా భావించబడతాయి. ఒక ఉద్యోగ స్థలంలోనైనా, ఒక విద్యాసంస్థలోనైనా వ్యక్తిగత స్వేచ్ఛ కంటే సమూహ నిబద్ధతకు ఎక్కువ విలువ ఉంటుంది. అయినప్పటికీ ఆధునికత ప్రభావంతో కొత్త తరానికి స్వతంత్ర ఆలోచనలపై ఆసక్తి పెరిగింది. యువత తమ వృత్తిని, తమ కలలను, తమ అభిరుచులను సమాజపు అంచనాల కంటే ముందుగా ఉంచుతున్నారు. ఉదాహరణకు, సాంకేతిక రంగంలో యువతులు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. అయినా కూడా వారు సమాజపు నియమాలను పూర్తిగా విడిచిపెట్టలేకపోతున్నారు. అందువల్ల జపాన్‌లో వ్యక్తిగత, సమూహ భావన రెండూ కలిసిన రూపంలో కనిపిస్తున్నాయి. ఇది ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక సమన్వయం. ఈ పరిస్థితి మన భారతీయ సమాజానికి కొంత దగ్గరగా ఉంటుంది. ఎందుకంటే మన దగ్గర కూడా వ్యక్తి స్వేచ్ఛ పెరుగుతున్నా కుటుంబ విలువలు పూర్తిగా చెరిగిపోవడం లేదు.

**చైనా** వంటి దేశాల్లో పరిస్థితి మరింత విభిన్నంగా ఉంటుంది. అక్కడ సమాజపు క్రమాలు, ప్రభుత్వ నియంత్రణలు బలంగా ఉంటాయి. వ్యక్తిగత స్వేచ్ఛపై ఆంక్షలు ఉండడం సహజమే. అయినప్పటికీ నగరాల్లో పెరుగుతున్న విద్యావకాశాలు, కొత్త సాంకేతిక పరిణామాలు, ఆధునిక వృత్తి రంగం యువతను స్వతంత్ర ఆలోచనలవైపు నెడుతున్నాయి.

కుటుంబ బంధాలపై ఆధారపడే ధోరణి తగ్గిపోతోంది. వ్యక్తులు తమ జీవిత భాగస్వామిని, తమ వృత్తిని స్వతంత్రంగా ఎంచుకునే ధైర్యం ప్రదర్శిస్తున్నారు. అయినా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం సమూహ భావన బలంగానే కొనసాగుతోంది. ఈ విభిన్నత చైనాకు ప్రత్యేకతను ఇస్తోంది. ఒకవైపు సంప్రదాయ నియంత్రణలు, మరోవైపు ఆధునిక స్వేచ్ఛల మేళవింపే అక్కడి వాస్తవం.



**ఫ్రాన్స్, జర్మనీ** వంటి దేశాల్లో వ్యక్తిత్వం అత్యధిక స్థాయిలో ఉంటుంది. ఫ్రాన్స్‌లో కళలు, సాహిత్యం, రాజకీయాలు అన్నీ వ్యక్తిగత అభిప్రాయాలను, స్వేచ్ఛను ముందుకు తీసుకెళ్తాయి. ఒక రచయిత, ఒక చిత్రకారుడు, ఒక పౌరుడు ఎవరికైనా తమదైన ఆలోచనను వ్యక్తం చేయడానికి సమాజం పూర్తి స్వేచ్ఛ ఇస్తుంది. జర్మనీలో కూడా పరిస్థితి అలానే ఉంటుంది. కానీ అక్కడ ఒక ప్రత్యేకత ఏమిటంటే– స్వేచ్ఛతో పాటు క్రమశిక్షణ, చట్టపరమైన నియంత్రణలు కూడా సమానంగా నడుస్తాయి. ఒక వ్యక్తి తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పగలిగినా, సమాజపు క్రమాన్ని అతిక్రమించలేడు. ఈ సమతుల్యత వల్లే ఆ దేశాలు బలంగా నిలుస్తున్నాయి.

**బ్రెజిల్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా** దేశాలు ప్రతి ఒక్కదాంట్లో వ్యక్తిత్వం వేర్వేరు రూపాలలో వ్యక్తమవుతోంది. **బ్రెజిల్‌లో** కుటుంబ అనుబంధాలు బలంగా ఉన్నప్పటికీ క్రీడలు, సంగీతం, సాంస్కృతిక రంగాల్లో వ్యక్తిగత ప్రతిభకు ప్రత్యేక గౌరవం ఉంది. **ఆస్ట్రేలియాలో** అయితే స్వేచ్ఛ సమాజపు మూలం. ప్రతి ఒక్కరు తమ ఇష్టాలను అనుసరించి జీవించగలరు. **ఆఫ్రికా** దేశాల్లో మాత్రం పరిస్థితి వేరుగా ఉంటుంది. అక్కడ ఇంకా సమూహ భావన, తెగల అనుబంధం బలంగానే ఉంటుంది. కానీ నగరాల్లో ఆధునికత ప్రభావంతో యువత వ్యక్తిత్వం వైపు మళ్లుతున్నారు.

పైన ఉదహరించిన దేశాల అనుభవాలను పరిశీలిస్తే మన భారతదేశ పరిస్థితి ఒక ప్రత్యేకతను కలిగి ఉంది. ఇక్కడ వ్యక్తిత్వం పెరుగుతున్నా, అది పూర్తిగా పాశ్చాత్య రూపంలో లేదు. ఒక యువకుడు లేదా యువతి తన వృత్తి, విద్య, వివాహం విషయంలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకున్నా కూడా కుటుంబ అనుబంధాలను విడిచిపెట్టడం అరుదే. ఇక్కడ స్వేచ్ఛ, సంప్రదాయం రెండు కలిసే నడుస్తున్నాయి. ఈ ప్రత్యేకతే భారతీయ వ్యక్తిత్వానికి ఒక ప్రత్యేకమైన రూపాన్ని ఇస్తోంది.

ప్రపంచం మార్పుల దిశగా పయనిస్తున్న క్రమంలో వ్యక్తిత్వం అనే భావన మానవ జీవనంలో ఒక కొత్త పుటను తెరిచింది. నిన్నటి వరకు సమూహం కేంద్రీకృతమైన విలువలు నేటి తరానికి ఒక విభిన్న కోణంలో మాత్రమే ఉపయోగపడుతున్నాయి. ఎందుకంటే మానవుడు ఇప్పుడు తన ప్రతిభను ప్రదర్శించుకోవాలని, తన కలలను వెంబడించాలని, తన జీవితం తన సొంత నిర్ణయాలతో ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాడు. ఈ ఆకాంక్ష ఏకపక్షంగా కాకుండా బహుముఖంగా ఉంది. ఒకరికి కళారంగం ప్రధానమైతే, మరొకరికి విజ్ఞాన రంగం ముఖ్యం. ఇంకొకరికి వ్యాపారం లేదా స్వతంత్ర జీవనశైలి ప్రాధాన్యం కలిగి వుంటుంది. ఈ విధంగా వ్యక్తిత్వం మానవ మనసులో కొత్త కొత్త రంగులను నింపుతోంది.

అయితే వ్యక్తిత్వం పెరుగుతున్నంత మాత్రాన అది ఒంటరితనానికి, వేరుపాటుకు దారితీస్తుందా.. అనే సందేహం తరచుగా తలెత్తుతుంది. కానీ వాస్తవానికి అది సరిగా అర్థం చేసుకున్న చోట సమాజానికి కూడా బలం చేకూరుస్తుంది. వ్యక్తి తన ప్రతిభను సరిగా ఉపయోగించుకుంటే అది సమాజానికి ఒక కొత్త మార్గాన్ని చూపుతుంది. శాస్త్రవేత్తలు తమ స్వతంత్ర ఆలోచనల వల్లనే కొత్త ఆవిష్కరణలు చేశారు.

కళాకారులు తమదైన దారిని ఎంచుకున్నందువల్లే ప్రపంచానికి కొత్త సౌందర్యం అందించారు. సమాజం వ్యక్తుల ప్రతిభలతోనే ముందుకు సాగుతుంది. అందువల్ల వ్యక్తిత్వం అనేది ఒంటరితనం కాదు, అది సమాజానికి కొత్త వెలుగును అందించే దారి అని చెప్పాలి.

ఈ రోజుల్లో సాంకేతిక పరిణామం వ్యక్తిత్వానికి మరింత బలం ఇచ్చింది. ఒక వ్యక్తి తన అభిరుచిని, తన వృత్తిని, తన అభిప్రాయాన్ని ప్రపంచానికి తక్షణం తెలియజేయగలుగుతున్నాడు. డిజిటల్ వేదికలు వ్యక్తికి అంతులేని అవకాశాలను అందిస్తున్నాయి. ఒక చిన్న ఊళ్లో ఉన్న యువకుడి ప్రతిభ కూడా ఇప్పుడు ప్రపంచ స్థాయికి చేరుకుంటోంది. ఈ మార్పు మనకు ఒక కొత్త సమాజాన్ని చూపుతోంది. అక్కడ వ్యక్తి ఒంటరిగా కాదు, కానీ తన ప్రత్యేకతతో సమాజానికి తోడ్పడుతున్నాడు. భారతీయ సమాజం ఈ విభిన్నత మధ్య ఒక కొత్త సమతుల్యతను పొందుతోంది. మన దగ్గర కుటుంబ అనుబంధాలు, సాంప్రదాయాలు ఉన్నా వ్యక్తిత్వం అనే భావన కూడా బలపడుతోంది. ఈ రెండూ కలిసినప్పుడే మన భవిష్యత్తు మరింత బలంగా ఉంటుంది. మన సమాజం ఒక వైపు తన మూలాలను కాపాడుకుంటూనే, మరోవైపు వ్యక్తి ప్రతిభకు అవకాశమిస్తూ ముందుకు సాగాలి. ఇదే భారతీయతకు ప్రత్యేకమైన సౌందర్యం.

**- డా. చిటికెన కిరణ్ కుమార్**

కథ

# కృతజ్ఞత

రంగాపురం గ్రామంలో రామయ్య అనే రైతు ఉండేవాడు. అతనికున్న రెండెకరాల పొలంలో వరి పంట పండించుకుంటూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తూ జీవనం గడిపేవాడు. రామయ్య భార్య రంగమ్మ కూడా వ్యవసాయ పనుల్లో భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. వ్యవసాయమే అతడి జీవనాధారం కాగా, ధాన్యానికి తగిన గిట్టుబాటు ధరల్లేక పెట్టుబడులు కూడా తడిసి మోపెడై బతుకుదెరువు కష్టమౌతున్న సమయంలో, పంటచేనులో ఎలుకల బెడదతో రామయ్యకు కొత్త సమస్య ఎదురైంది. ఎలుకల నివారణకు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. గడచిన రెండు పంటల కాలంలో ఎలుకల బెడదతో ధాన్యం చాలా నష్టపోయి, దిగుబడి తగ్గింది.

ఒకరోజు మధ్యాహ్నం ఈ విషయాన్నే ఆలోచిస్తూ పొలం గట్టున చెట్టు కింద రంగయ్య సేదదీరుతుండగా, టపటపమని రెక్కల చప్పుడు చేస్తూ అదే చెట్టు పైన ఒక గద్ద వాలింది. అది చెట్టుపై నున్న గుడ్లగూబ గూడును చెదరగొట్టి దాని పిల్లలను తినేందుకు ప్రయత్నిస్తోంది. చెట్టు కింది నుండి ఈ విషయం గమనిస్తున్న రామయ్య పక్కనే వున్న ఒక పెద్ద కర్రనందుకుని గద్దను తరిమే యడంతో అది భయపడి పారిపోతుండగా, గూడు నుండి జారిపడిన గుడ్లగూబ పిల్లలు పొలంగట్టున గడ్డిలో పడి అరువసాగాయి.

పక్షిపిల్లలను చూసి ఆవేదన చెందిన రామయ్య వాటిని తీసుకుని చెట్టెక్కి గూటిని కొంచెం సవరించి తిరిగి ఎప్పటిలాగే వాటిని జాగ్రత్తగా గూటిలో పెట్టి, చెట్టు దిగి గట్టుపై కూర్చున్నాడు. కొంచెంసేపటికి చెట్టును చేరిన గుడ్లగూబ చెదిరినపోయివున్న గూడును చూసి ఆందోళన చెందినప్పటికీ, గూట్లో పిల్లలను చూసి క్షేమంగా ఉన్నారని సంతోషించింది.

ఆ తదుపరి పిల్లలు జరిగినదంతా తల్లికి చెప్పడంతో కంగారుపడిన గుడ్లగూబ కాస్సేపటికి తేరుకొని చెట్టు కింద కూర్చున్న రామయ్య దగ్గరికి వెళ్ళి, తన పిల్లలను కాపాడినందుకు కృతజ్ఞతలు తెలిపింది. విచారంతో కూర్చున్న రామయ్యను గుడ్లగూబ ప్రశ్నించగా, విషయమంతా వివరిస్తూ రామయ్య తన బాధను వ్యక్తం చేశాడు. మీరింక బాధ పడవద్దని, తమ పొలంలో ఎలుకలను ఏరివేసి, మరల పొలంలోకి వాటిని రాకుండా చేసే బాధ్యత తనదని గుడ్లగూబ రామయ్యకు ధైర్యం చెప్పింది. తన పిల్లలను కాపాడినందుకు తాను ఋణం తీర్చుకుంటానని మాట ఇచ్చింది. గుడ్లగూబ మాటలతో రామయ్య ఆశ్చర్యపడుతూనే ఊరట చెందాడు.

మరుసటి రోజు ఉదయమే తన పిల్లలకు జాగ్రత్తలు చెప్పి అడవిలోకి వెళ్ళిన గుడ్లగూబ సహచరులైన అనేక గుడ్లగూబలను తోడ్కొని వచ్చి, రామయ్య పొలం చుట్టూ తిరుగుతూ కనిపించిన ఎలుకలను ఎప్పటికప్పుడు నోట కరుచుకుని చంపి, వందలాది ఎలుకల పని పట్టాయి. ఇలా వరుసగా మూడు నాలుగు రోజులు చేయడంవల్ల వాటికి కడుపునిండా తిండి దొరికింది. మిగిలిన ఎలుకలు భయపడి పారిపోయాయి. అవి కలుగుల వెంటపడి మరీ వేటాడి ఎలుకలను చంపడంతో రామయ్య సమస్యకు పరిష్కారం లభించింది.

గుడ్లగూబ సమయస్ఫూర్తికి రామయ్య సంతసించి దానికి కృతజ్ఞతలు తెలిపాడు. తదుపరి అతని పొలంలోనూ పంట దిగుబడి పెరిగి, అప్పటి నుండి రామయ్య ఆనందంగా జీవించసాగాడు.

**- నాగరాజు కామర్సు**

## బాలగేయం

### ధ్యాస



చదువు సన్నిధి సుఖమన్నా
బడియే..
బాలల దోస్తన్నా
గురువుల  భోదే మేలన్నా
జ్ఞానాలకు పెన్నిధి అన్నా

బాల గేయాలు
శతక పద్యాలు
కంఠమెత్తి పాడాలి
లోకమే మురియాలి

అమ్మా నాన్న కోరికలూ
పెద్దవారి మాటలు
చదవు పై సూచనలు
చదివే శ్వాస ధ్యాసలు

**– పెందోట వెంకటేశ్వర్లు**
సిద్దిపేట

## హాలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**కె.మనోహర్, కాకినాడ**

**ప్రశ్న: ఆకలిగా వుంటే పేగులు శబ్దాలు చేస్తాయెందుకు?**

**జవాబు:** ఆకలి కడుపులో కాకుండా మెదడులో పుడుతుంది. మెదడులో ఆకలికి సంబంధించిన కేంద్రం ఒకటుంది. ఇది కడుపు, పేగులు చేయవలసిన పనిని నియంత్రిస్తుంటుంది. శరీరంలో శక్తినిచ్చే ఆహారం సరైన స్థాయిలో ఉన్నప్పుడు మెదడులోని ఆ కేంద్రం, కడుపు, చిన్న, పెద్ద పేగులు చేసే పనులు నెమ్మదిగా చేసేలా చేస్తుంది. శరీరంలో రక్తం తయారీకి సరిపోయేంత ఆహారం కడుపులో లేకపోతే ఆ కేంద్రం కడుపు, పేగులలో చిన్న చిన్న ప్రకంపనలను కలుగజేస్తుంది. వెంటనే పేగులు చురుకుదనాన్ని పొందుతాయి. ఈ ప్రకంపనలే మనకు కడుపులో నుంచి శబ్దాలు వినవస్తున్నట్లు అనిపిస్తుంది.

**బి.ప్రహ్లాద్, గుడివాడ**

**ప్రశ్న: కేబుల్ వైర్‌ను టీవీకి పెట్టగానే స్క్రీన్ మీద బొమ్మలు ఎలా వస్తాయి?**

**జవాబు:** కేబుల్ వైర్‌లో నుంచి వచ్చే తరంగాలు బొమ్మల మాదిరిగా మారతాయి. కాథోడ్-రే-ట్యూబ్ సహాయంతో బొమ్మలుగా మారతాయి. దీనినే పిక్చర్ ట్యూబ్ అని పిలుస్తాం. ఈ ట్యూబ్‌లో ఉండే ఫోకసింగ్ కాయిల్స్ కేబుల్ వైర్ అందించిన తరంగాలను గ్రహించి వాటిని కాథోడ్ కిరణాల్లా మార్చి స్క్రీన్ మీదకు పంపిస్తాయి. స్క్రీన్ మీద ఈ కిరణాలు బొమ్మల్లాగా మారి ఆటలు ఆడతాయి, మాట్లాడతాయి, పాటలు పాడతాయి.

# భారత ఉపగ్రహాలకు 'బాడీ గార్డులా?'

అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టబడిన మన ఉపగ్రహాలు అత్యంత ప్రధానమైన అమూల్య అంతరిక్ష ఆస్తులుగా భావిస్తున్నాం. అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టబడిన భారతీయ ఉపగ్రహాలకు ఇతర దేశాల ఉపగ్రహాలతో ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన ఇస్రో రానున్న రోజుల్లో మన ఉపగ్రహాలకు రక్షణ కవచంగా 'బాడీ గార్డు ఉపగ్రహాల'ను లేదా 'బాండీ గార్డు సాటిలైట్'లను ప్రయోగించడానికి నిర్ణయం తీసుకోవడం ఒక ఆశ్చర్యకరమైన అంశంగా పౌర సమాజం భావిస్తున్నారు. అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టబడిన మన ఉపగ్రహాలు వాతావరణ హెచ్చరికలు, దేశ రక్షణ రంగాలు, ఖనిజ సంపద అధ్యయనాలు, సమాచార డిజిటల్ ఉపకరణాలు లేదా కమ్యూనికేషన్, భూ సంపద పర్యవేక్షణ లాంటి పలు అత్యంత ప్రయోజనాలు కలిగి ఉండడంతో వాటి భద్రత మన తక్షణ కర్తవ్యంగా ఇస్రో ప్రణాళికలు వేస్తున్నట్లు తెలుస్తోంది.



వివిధ దేశాలు ప్రయోగించిన అంతరిక్ష ఉపగ్రహాలకు తోడుగా ఎలాన్ మస్క్ స్టార్‌లైనర్ నెట్‌వర్క్ ఉపగ్రహాలతో 'స్పేస్ ట్రాఫిక్' లేదా 'అంతరిక్ష రద్దీ' క్రమంగా పెరగడంతో కక్ష్యలోని ఉపగ్రహాల భద్రత ప్రమాదంలో పడుతున్నట్లు తేల్చారు. ఈ విధంగా ఉపగ్రహ రక్షణ చర్యలను వెంటనే తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం కూడా ఇస్రోకు సూచనలు చేయడంతో పాటు ఈ ప్రాజెక్టుకు రూ.270 బిలియన్ల నిధులు కేటాయించడం కూడా జరిగింది.

## యాభైకి పైగా బాడీ గార్డు ఉపగ్రహాల ప్రయోగం

ఇటీవల 2024 యేడాది మధ్యలో భూతలం నుంచి 500-600 కి.మీ. దూరంలో ఉన్న మన ఉపగ్రహాలకు అత్యంత సమీపంలోకి (ఒక కి.మీ. సమీపానికి) మరో దేశపు ఉపగ్రహం రావడాన్ని గమనించారు. ఇదే జరిగితే రెండు ఉపగ్రహాలు ఢీకొని విధ్వంసం కావడం జరిగే ప్రమాదం ఉందని ఇస్రో అంచనా వేస్తున్నది. కక్ష్యలో తిరుగుతూ తమ తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్న మన ఉపగ్రహాలకు రక్షకులుగా దాదాపు యాభై 'బాడీ గార్డు ఉపగ్రహాల'ను ప్రయోగించడానికి ఇస్రో సమాయత్తం అవుతున్నది. ఇలా ప్రయోగించిన బాడీ గార్డు ఉపగ్రహాలు మన ఉపగ్రహాలకు సమీపంలో ఉంటూ నిరంతర నిఘా చేస్తూ, అంతరిక్ష భద్రత కవచంలా పని చేస్తుందని ఇస్రో వివరిస్తున్నది. బాడీ గార్డు ఉపగ్రహాలు తమ సమీపానికి వచ్చే ఇతర ఉపగ్రహాలను గుర్తించడం, 'లిడార్' టెక్నాలజీతో సత్వరమే హెచ్చరికలు చేయడం ద్వారా అత్యంత విలువైన మన ఉపగ్రహాలను కాపాడడం జరుగుతుందని తెలుపుతున్నారు.



మనం ప్రయోగించనున్న బాడీ గార్డు ఉపగ్రహాలు మన భూతల రాడార్ వ్యవస్థలతో అనుసంధానం కావడం ద్వారా నిరంతర నిఘా చేస్తూ, పొంచి ఉన్న ప్రమాదాలను పసిగట్టి సమాచారం అందించడం జరుగుతుందని వివరిస్తున్నారు. మన ఉపగ్రహాల పని తీరు, సమాచార విశ్లేషణ, భద్రత నిఘా లాంటి విధుల్లో 400లకు పైగా ఇస్రో అంతరిక్ష శాస్త్రజ్ఞులు ప్రతి క్షణం విధులు నిర్వహించడం జరుగుతున్నది.

## పొంచి ఉన్న అంతరిక్ష ప్రమాదాలు

భారతదేశ పొరుగు శత్రు దేశాలైన చైనా, పాకిస్థాన్‌లతో పొంచి ఉన్న సరిహద్దు వివాదాలు, కక్షపూరిత ప్రమాదాలను గమనించిన కేంద్ర ప్రభుత్వం బాడీ గార్డు ఉపగ్రహాల పథకానికి పూనుకోవడం సముచితంగా ఉన్నది. ఈ దేశాలు మన ఉపగ్రహాల విధ్వంసానికి కూడా ప్రణాళికలు వేసే ప్రమాదం కూడా ఉన్నందున ఈ నిర్ణయాన్ని ప్రాధాన్యతా క్రమంలో తీసుకోవడం జరుగుతున్నది. అంతరిక్ష కక్ష్యల్లో చైనాకు చెందిన 930 ఉపగ్రహాలు, పాకిస్థాన్‌కు చెందిన 08 ఉపగ్రహాలతో మన భారత్‌కు చెందిన దాదాపు 100 ఉపగ్రహాలకు భద్రతా పరమైన చిక్కులు రావచ్చని అంచనా వేస్తున్నారు.

డిజిటల్ ఏఐ యుగంలో అంతరిక్ష ఉపగ్రహాలు చేస్తున్న సేవలు అనితర సాధ్యాలు. ఒక్క క్షణం ఉపగ్రహం పని చేయకపోయినా పౌర జీవనం అస్తవ్యస్తం అయ్యే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్తగా పొరుగు దేశాల దురాలోచనలను దృష్టిలో పెట్టుకొని మన ఉపగ్రహాలకు బాడీ గార్డులను నియమించాల్సిందేనని సామాన్యులు కోరుకుంటున్నారు. వచ్చే యేడాది ఈ ప్రాజెక్టును ఇస్రో విజయవంతంగా ప్రయోగించారని కోరుకుందాం.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

# బాలికల సాధికారతే లక్ష్యంగా..

ప్రతి సంవత్సరం అక్టోబర్ పదకొండవ తేదీన ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటారు. ఇది బాలికల హక్కులు, సమానావకాశాలు, సాధికారత కోసం ప్రత్యేకంగా గుర్తించబడింది. 2011లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ దీనిని అధికారికంగా ఆమోదించింది. ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న వివక్ష, సామాజిక, ఆర్థిక, విద్యా, ఆరోగ్య సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించడం, వాటి పరిష్కారానికి ప్రేరేపించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం.

ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, బాలికలు అనేక సమస్యలకు గురవుతుంటారు. చదువుకోవడానికి అవకాశాల్లేకపోవడం, బాల్య వివాహాలు, ఆర్థిక, సామాజిక వివక్ష, నాయకత్వం అవకాశాల లోపం మొదలైనవి ముఖ్య సమస్యలు. 2011లో యునైటెడ్ నేషన్స్ ప్రతిపాదించిన ఈ దినోత్సవం ద్వారా సమానత్వం, హక్కుల పరిరక్షణ, సాధికారత అనే అంశాలను ప్రోత్సహించడం లక్ష్యం. దినోత్సవం తరువాత ప్రతి సంవత్సరం, ప్రత్యేక థీమ్‌లతో ఈ రోజును జరుపుతూ, సమస్యలపై అవగాహన పెంచడం జరుగుతుంది.



నాలుగు ప్రధాన లక్ష్యాలు నాలుగు ప్రధాన కోణాల్లో ఉంటాయి. ఒకటి: విద్యావకాశాలను ప్రోత్సహించడం. బాలికలు అన్ని స్థాయిలలో చదువుకోవడానికి సమాన అవకాశాలు కల్పించడం. రెండు: ఆరోగ్య పరిరక్షణ. సంతానాపేక్ష, మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి. మూడు: సమానత్వం, హక్కులు. లింగ మూలక వివక్షను నివారించడం, హక్కులను రక్షించడం. నాలుగు: సాధికారత. బాలికలు నాయకత్వ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ముందడుగు వేయడానికి ప్రోత్సహించడం.

ప్రపంచ వ్యాప్తంగా స్కూళ్లు, కళాశాలలు, సామాజిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తాయి. సదస్సులు, వర్క్ షాప్‌లు, అవగాహన ర్యాలీలు, కమ్యూనిటీ సమావేశాలు బాలికల సమస్యలపై దృష్టి కలిగిస్తాయి. బాలికల ప్రతిభను ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డులు, లీడర్‌షిప్ శిబిరాలు కూడా జరుగుతాయి. భారతదేశంలో.. ముఖ్యంగా గ్రామీణ, బలహీన వర్గాల్లో, బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. 6-14 యేళ్ల బాలికల్లో కొన్ని ప్రాంతాల్లో విద్యా రహిత శాతం ఇరవై శాతానికి పైగా ఉంది. ప్రతి యేడాది లక్షలాదిగా పద్దెనిమిది యేళ్లలోపు బాలికలకు వివాహాలు అవుతున్నాయి. ఆర్థిక స్వావలంబనలో పరిమితులు, ఉపాధి అవకాశాల్లో అడ్డంకులు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, భారత ప్రభుత్వం, అనేక స్వచ్ఛంద సంస్థలు ఈ దినాన్ని ఆసక్తిగా, ప్రేరణాత్మకంగా జరుపుతూ, బాలికల హక్కులు, స్వావలంబన, సమానత్వం కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రతి సంవత్సర యు.ఎన్., యునిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఒక ప్రత్యేక థీమ్‌ను ప్రకటిస్తాయి. 2022లో 'డిజిటల్ జనరేషన్, అవర్ జనరేషన్', 2021లో 'ఇన్‌వెస్ట్ ఇన్ గర్ల్స్, అనలాక్ ద ఫ్యూచర్' వంటి థీమ్‌లు బాలికల ప్రాధాన్యత, ప్రగతికి దృష్టి పెట్టి, కార్యక్రమాలను ఆకర్షణీయంగా మార్చుతాయి.

భారతదేశంలో ప్రత్యేక కార్యక్రమాలు విద్యా ప్రోత్సాహ పథకాలు, బాల్య వివాహ నివారణ చట్టాలు, ఆర్థిక సాధికారత పథకాలు, ఆరోగ్య పరిరక్షణ చర్యలు ద్వారా చేపడుతున్నారు. విద్యా ప్రోత్సాహ పథకాల ద్వారా స్కూల్ ఫీజులు, ఉపకరణాలు, విద్యార్థి బహుమతులు అందించబడతాయి. బాల్య వివాహ నివారణ చట్టాల ద్వారా 18 యేళ్ల కంటే తక్కువ వయసులో వివాహం జరగకుండా నియంత్రణ ఉంటుంది. ఆర్థిక సాధికారత కోసం శ్రామిక, శిల్ప, స్వయం సహాయ గ్రూపుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఆరోగ్య పరిరక్షణలో రక్తనిరోధక సర్వేలు, బోధన కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రపంచంలో 130కు పైగా దేశాల్లో ఈ దినోత్సవాన్ని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు పాటిస్తూ, బాలికల హక్కులు, సాధికారత, సమానత్వంపై అవగాహన కలిగించడానికి వేదికగా ఉపయోగిస్తున్నారు. UNDP గణాంకాల ప్రకారం, ప్రపంచంలో ప్రతి నాలుగో బాలిక 15-19 యేళ్ల లోపు బాల్య వివాహానికి గురవుతోంది. 12 యేళ్ల లోపు బాలికల్లో పది మంది విద్యా రహితంగా ఉంటారు. ఈ సమస్యలు అన్ని దేశాల్లో నిరంతర సవాళ్లను సృష్టిస్తున్నాయి.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం కేవలం జెండాలు, సమావేశాలు మాత్రమే కాదు. ఇది సమాజంలో బాలికల స్థానాన్ని మెరుగుపరచడానికి, హక్కులు సాధికారత, సమానత్వం సాధించడానికి ప్రేరణ కలిగించే వేదిక. ప్రతి బాలికకు చదువు, ఆరోగ్యం, భద్రత, స్వావలంబన అవకాశాలను సమానంగా అందించడం ద్వారా మాత్రమే సమాజం, దేశం, ప్రపంచం సమగ్ర అభివృద్ధి సాధించగలుగుతుంది.

**- రామకిష్టయ్య సంగనభట్ల**

కథ

# అంతర్వాహిని

పి.వి.ఎస్.కృష్ణకుమారి

**"ఎన్నాళ్ళయిందిరా కిరణ్, నిన్ను చూసి. అమెరికా నుంచి వచ్చి పది రోజులు అయింది. ఇప్పుడు గుర్తొచ్చాడా ఈ మామయ్య?" కారు దిగి గేటు తీసుకుని లోపలికి వస్తున్న కిరణ్‌కి ఎదురు వెళ్ళి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు శేఖర్.**

**"ఏది మావయ్యా, వచ్చాక రెండు రోజులు జెట్ లాగ్. ఆ తర్వాత ముఖ్యమైన బ్యాంకు పనులతోనే సరిపోయింది" అన్నాడు, కిరణ్.**

"అవునులేరా, ఏదో అభిమానంతో అలా అన్నానే కానీ నాకు తెలియదా! రామ్మా జ్యోతి, ఎలా ఉన్నావు?" అంటూ ఇద్దర్నీ లోపలికి తీసుకెళ్లాడు శేఖర్.

ఈ హడావిడి కిచెన్‌లో పని చేసుకుంటున్న శేఖర్ భార్య రమ గబగబా హాల్లోకి వచ్చి,

"ఏమయ్యా కిరణ్, ఎలా ఉన్నావు? పొద్దున నీవు ఫోన్ చేసి వస్తానని చెప్పినప్పటి నుండి మీ మామయ్య దృష్టి అంతా గేటు మీదనే. గేటు దాకా వచ్చినవాళ్ళు ఇంట్లోకి వస్తారు కదా! ఎందుకంత ఆత్రం అంటే నన్ను విసుక్కున్నారు" అంటూ జ్యోతి చేయి పట్టుకుని.

"కూర్చోమ్మా జ్యోతీ, పిల్లలు రాలేదా?" అని అడిగింది.

"అక్కయ్యవాళ్ల పిల్లలు వచ్చారుగా, వాళ్లతో ఆడుకుంటున్నారు. నీ ఆరోగ్యం ఎలా ఉంటున్నది మావయ్యా? చాలా సన్నబడ్డావు?" సోఫాలో కూర్చుంటూ అన్నాడు, కిరణ్.

"బాగానే ఉందిరా, పెద్ద వయసు కదా! బి.పి, షుగర్.. ఏదో ఇలా ఉన్నాను" అన్నాడు శేఖర్.

"బావ వాళ్ళు ఎలా ఉన్నారు?" అడిగాడు కిరణ్ .

"బాగానే ఉన్నారురా. పెద్ద బావ బెంగళూరులో ఇల్లు కట్టుకున్నాడు. చిన్న బావ కూకట్‌పల్లిలో ఉంటున్నాడు" అన్నాడు.

"ముందు లంచ్ కానివ్వండి. తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అన్నది రమ.

భోజనాలు చేసాక అందరూ కబుర్లలో పడ్డారు.

"అవునూ, చిన్న మామయ్యవాళ్ళు రాలేదేంటి? నేను వస్తానని తెలుసుగా?" అడిగాడు కిరణ్ .

కిరణ్ చిన్న మేనమామ ఇల్లు వీళ్ళ ఇంటి పక్కనే. తను రాగానే చిన్న మామయ్యవాళ్ళు కూడా వస్తారు, సరదాగా ఉండవచ్చు.. అనుకున్న కిరణ్‌కి కొంచెం నిరుత్సాహం కలిగింది.

శేఖర్ ఏదో చెప్పబోయే లోపల–

"వాళ్ళ కబుర్లు మాకు ఏం తెలియవయ్యా, రెండు సంవత్సరాలయింది వాళ్లు మాతో మాట్లాడి. మంచి చేయబోయి మేం చెడ్డవాళ్ళం అయ్యాం. అంతా మా కర్మ" అంది రమ.

"మీ అమ్మ ఇక్కడ విషయాలు నీకు చెప్పే ఉంటుంది కదా!" అన్నాడు శేఖర్.

"అది కాదు కిరణ్ నీవే చెప్పు, నీ కొడుకు చెడు మార్గంలో వెడుతున్నాడు, పిల్లవాడిని అదుపులో పెట్టుకో అని పెద్దవాడిగా మీ మావయ్య చెప్పటం తప్పా? దానికి మీ చిన్నత్త తన కొడుకుని మేమేదో అల్లరి పెట్టామని నానా యాగీ చేసింది".

రమా, శేఖర్ ఇద్దరూ వాళ్ళ మనసులోని బాధంతా కిరణ్, జ్యోతులకు చెప్పుకొచ్చారు. కిరణ్‌కి ఇక్కడి విషయాలు ఏమీ తెలియవు. నిజానికి, తల్లి ఒకసారి తన అన్నదమ్ముల మధ్య ఉన్న మనస్పర్థలు చెప్పబోతే–



**"లోపల ఉంది కూర్చోండి" అంటూ, "ఏమోయ్ శైలూ, ఎవరు వచ్చారో చూడు" అంటూ పిలిచాడు భాస్కర్.**

**"ఆ.. వస్తున్నా" అంటూ వచ్చి "హాయ్ కిరణ్, జ్యోతి బాగున్నారా?" అని పలకరించి కిరణ్ పక్కనే కూర్చుని- "అమెరికా వెళ్లాక మమ్మల్ని మర్చిపోయారు. కనీసం ఫోన్ కూడా చేయలేదు, మాకు సరే సాయికైనా చేయొచ్చు కదా! అంతేలే.. మేం మీ అంత గొప్పవాళ్ళం కాదుగా" అంటూ నిస్టూరాలాడింది.**

"అమ్మా, అక్కడి గొడవలు నాకేమీ చెప్పవద్దు. మేం ఇక్కడ ప్రశాంతంగా ఉంటున్నాం" అన్నాడు. ఆ తర్వాత తల్లి ఏనాడూ ఇక్కడ విషయాలు చెప్పలేదు. అందుకే అసలు పక్క పక్క ఇళ్లల్లో ఉండే మామయ్యలు ఇద్దరి మధ్య వైరం ఎలా ఏర్పడిందో కిరణ్‌కి తెలియదు.

సాయంకాలం కాగానే "వెళ్ళొస్తాం" అంటూ లేచారు కిరణ్, జ్యోతి.

"ఉండండి.. రాత్రికి కూడా ఇక్కడే భోంచేసి వెళ్దురు" అన్నాడు శేఖర్.

"లేదులే మావయ్యా, చిన్న మామయ్య వాళ్ళ ఇంటికి వస్తానని చెప్పాను" అన్నాడు కిరణ్.

"సరే మీ ఇష్టం" అన్నాడు. అప్పటిదాకా నవ్వుతూ మాట్లాడిన రమ మొహం తిప్పుకుంది

గేటు దాకా వచ్చి సాగనంపుతూ "చాలా ఆనందంగా ఉందిరా కిరణ్ నువ్వు రావటం. అప్పుడప్పుడు ఫోను చేస్తూ ఉండు. మళ్ళీ నువ్వు ఇండియా వచ్చేసరికి నేను ఉంటానో, ఉండనో" అంటున్న శేఖర్ గొంతు కాస్త జీరగా మారింది.

"ఛ ఛ, అవేం మాటలు మామయ్యా. నీకేం ఏంకాదు. ధైర్యంగా ఉండు. బావా వాళ్ళని అడిగానని చెప్పు" అంటూ బయటికి వచ్చి చిన్న మామ ఇంటి వైపు నడిచారు.

గేటు శబ్దమైనా ఎవరూ బయటికి రాకపోయేసరికి "ఇంట్లో ఎవరూ లేరా ఏంటి?" అనుకుంటూ హాలుతెలుపు నెట్టగా, లోపల టీవీ చూస్తున్న భాస్కర్ లేచి "హలో కిరణ్, జ్యోతి, రండి, రండి. ఇప్పుడేనా రావటం?" అంటూ ఆహ్వానించాడు.

ఉదయం కిరణ్‌వాళ్ళు తన అన్న ఇంటికి వెళ్ళటం గమనించినా కూడా ఏమీ తెలియనట్లు అడిగాడు భాస్కర్.

"పొద్దున పెద్ద మామయ్య వాళ్ళ ఇంటికి వెళ్ళి వస్తున్నాం. అత్తయ్య ఏది? లేదా?" అంటూ కిచెన్ వైపు చూసాడు.

"లోపల ఉంది కూర్చోండి" అంటూ, "ఏమోయ్ శైలూ, ఎవరు వచ్చారో చూడు" అంటూ పిలిచాడు భాస్కర్.

"ఆ.. వస్తున్నా" అంటూ వచ్చి "హాయ్ కిరణ్, జ్యోతి బాగున్నారా?" అని పలకరించి కిరణ్ పక్కనే కూర్చుని–

"అమెరికా వెళ్లాక మమ్మల్ని మర్చిపోయారు. కనీసం ఫోన్ కూడా చేయలేదు. మాకు సరే సాయికైనా చేయొచ్చు కదా! అంతేలే.. మేం మీ అంత గొప్పవాళ్ళం కాదుగా" అంటూ నిస్టూరాలాడింది.

సాయి భాస్కర్ కొడుకు. కిరణ్, సాయి సమ వయస్కులు అవటంతో చిన్నప్పటి నుంచి సెలవులు వస్తే ఆడుతూ పాడుతూ గడిపేవాళ్ళు. పెద్దయ్యాక కిరణ్ అమెరికా, సాయి బెంగళూరు వెళ్లటంతో ఇద్దరి మధ్య కొంత గ్యాప్ వచ్చింది.

"నా మీద అభాండం వేయకు అత్తా, నేను సాయికి ఎన్ని సార్లు ఫోన్ చేశానో తెలుసా! ఒక్కసారి కూడా లిఫ్ట్ చేయడు. ఇప్పుడు కూడా నేను ఇండియా వస్తున్నాను, నీవు కూడా రారా సరదాగా గడుపుదామంటే నాకు లీవులు లేవు, రాను.. అన్నాడు. నేనేం చేయను? అత్తా నీ చేతి వంట తిందాం అని వస్తే నిష్ఠురాలు ఆడతావా?" అన్నాడు.

కిరణ్‌కి భాస్కర్ భార్య శైలజ దగ్గర చనువెక్కువ.

ఆ మాటలకి శైలజ మొఖం విప్పారింది.

"చూసావా జ్యోతీ, మీ ఆయనకి నేను అన్నా, నా చేతి వంట అన్నా ఎంత ఇష్టమో! కాకరకాయ ఉల్లికారం పెట్టి చేస్తే ఎంత ఇష్టంగా తింటాడో. ఉండు అరగంటలో చేస్తాను" అంటూ కిచెన్‌లోకి వెళ్ళింది శైలజ.

"అంతే కాదమ్మా. నాకు నా పుట్టినరోజు చేసుకునే అలవాటు లేదు. వీడు కొంచెం పెద్దదైన దగ్గర నుండి ప్రతి సంవత్సరం నా పుట్టిన రోజుకి మా ఇంటికి వచ్చి కేక్ కట్ చేయించి చాలా హడావిడి చేసేవాడు" అంటూ ఉత్సాహంగా చెప్పాడు భాస్కర్.

మొదట్లో సీరియస్‌గా ఉన్న వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. డిన్నర్ పూర్తి చేసి రాత్రి పదింటికి ఇల్లు చేరారు. వస్తూనే తల్లిని అడిగాడు మావయ్యలు ఇద్దరికీ మధ్య వైరం ఎందుకు ఏర్పడింది అని.

"వడ్ల గింజలో బియ్యపు గింజ. నీకు తెలుసుగా అత్తయ్య లిద్దరికీ ఒకరంటే ఒకరికి పడదు. మామయ్యలు ఇద్దరూ భార్యల మాట జవదాటరు. పిల్లల మధ్య గొడవలు పెద్ద వాళ్ళదాకా వెళ్ళి చివరకు ఇద్దరు బద్ధ శత్రువులుగా మారారు. పక్క పక్కన ఇళ్లు కట్టుకున్నారు కానీ ఏనాడు సఖ్యతగా ఉన్నది లేదు. ఇప్పుడు ఈ గొడవలతో ఒకరి ముఖం ఒకరు చూడటం మానేశారు" అన్నది వైదేహి బాధగా కొడుకుతో.

పన్నెండు సంవత్సరాల క్రితం అమెరికా వెళ్ళిన కిరణ్ నాలుగు సార్లు మాత్రమే ఇండియా వచ్చాడు. ఇండియాలో ఉన్న నెల రోజుల్లో బంధువులందరిని కలవడానికి వీలుకాదు. అందుకని ఒక్కొక్కసారి ఒక్కొక్కళ్ళ దగ్గరికి వెళ్లి వస్తూ ఉంటాడు.

పది రోజులు హైదరాబాదులో తల్లిదండ్రుల దగ్గర ఉన్న తర్వాత విజయవాడ అత్తగారింటికి వెళ్లి, అక్కడ నుండి అక్క హారిక దగ్గరికి వైజాగ్ వెళ్ళాడు.

హారిక భర్త ఆంధ్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్. బావమరిది వచ్చాడని వారం రోజులు సెలవు పెట్టాడు.

అక్క దగ్గర ఉన్న వారం రోజులు క్షణాల్లో గడిచిపోయాయి. హారిక పిల్లలు, కిరణ్ పిల్లలు అందరూ కలిసి ఒకటే సందడి. అందరూ కలిసి ఒకరోజు భీమిలి, మరొక రోజు అరకు, ఇంకొక రోజు రామకృష్ణ బీచ్ ఇలా వారం రోజులు సరదాగా కలిపారు.

ఆ మరుసటి రోజు అందరూ కలిసి హైదరాబాద్ ప్రయాణమయ్యారు. తమ్ముడికి సెండ్ ఆఫ్ ఇవ్వటానికి హారిక పిల్లలతో కలిసి హైదరాబాద్ ప్రయాణమైంది.

ఆ రాత్రి అందరూ పడుకున్న తర్వాత హారికా, కిరణ్ ఇద్దరు బయట లాన్‌లో కుర్చీలు వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. అక్క అంటే కిరణ్‌కి ప్రాణం. హారిక దగ్గర కిరణ్ చిన్నపిల్లవాడే అవుతాడు. హారిక కూడా తమ్ముడిని అలాగే చూస్తుంది .

"ఏమిటోరా, నీవు వస్తావని ఎదురు చూసినంతసేపు పట్టదు నీవు రావటం, మళ్ళీ వెళ్ళటం. నీవు వెళ్ళిన తర్వాత వారం రోజుల వరకు దిగులుగా ఉంటుంది. నాకే ఇలా ఉంటే ఇక అమ్మా నాన్నలకు ఎలా ఉంటుందో!" అంది హారిక.

"నాకు అలాగే ఉంటుంది అక్కా. రోజులు క్షణాల్లో గడిచిపోయాయి. కానీ వెళ్ళక తప్పదు కదా!" అన్నాడు. కిరణ్ మనసులోని బాధ స్పష్టంగా తెలుస్తోంది.



"నిజం చెప్పరా! నీకు అసలు ఇండియా వచ్చే ఉద్దేశం ఉందా? ఎప్పటికప్పుడు ఇంకో రెండేళ్లే అంటున్నావు. వెళ్లి పన్నెండు సంవత్సరాలైంది. నీ వాలకం చూస్తుంటే వచ్చే ఉద్దేశం లేనట్లుంది. అమ్మా నాన్నలకి కూడా ఇదివరకటి ఓపిక ఉండటం లేదు. పెద్దతనంలో వాళ్ళు ఒంటరిగా ఉండాల్సి వస్తున్నది" అంది హారిక.

"నాకు రావాలనే ఉంది అక్కా. కానీ ఇక్కడ మనుషులు ప్రవర్తన, మనస్తత్వాలు చూస్తుంటే రావాలనిపించడం లేదు. ఒకళ్ళంటే మరొకరికి పడదు. అందరి ఇళ్లల్లో ఏవో గొడవలు. సరదాగా గడుపుదామని వస్తే ఏదో చికాకులు. ఇండియాలో ఈర్ష్య, అసూయలు ఎక్కువ. ప్రేమలు మరుగున పడుతున్నాయి. అక్కడ ఎంత ప్రశాంతంగా ఉంటుందో! వారంలో ఐదు రోజుల కష్టపడినా వీకెండ్స్ స్నేహితులతో చాలా సరదాగా గడిచిపోతుంది. మళ్లీ శని, ఆదివారాల కోసం ఎదురు చూస్తారు. కానీ ఇక్కడ కాసేపు ఎవరితో మాట్లాడినా వాళ్ల సమస్యలతో బాధలతో మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు. ఇక అమ్మా నాన్నల సంగతి అంటావా? అమెరికా వచ్చి పోతూ ఉంటారు. మరీ ఉండలేకపోతే అప్పుడే ఆలోచిస్తాను" అన్నాడు కిరణ్.

తమ్ముడు మాటలకి హారిక నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"ఏంటి అక్కా, నేను అన్నదానికి కోపం వచ్చిందా?" అడిగాడు కిరణ్.

"కోపం కాదురా! పరిస్థితులను నీ కోణం నుండే చూసి ఇండియాలో మనుషుల మధ్య ప్రేమానురాగాలు ఉండవు అనే నీ అభిప్రాయం గురించి ఆలోచిస్తున్నాను. నీవు ఇండియా రాకపోవటానికి కారణం ఇక్కడ పరిస్థితులే అంటుంటే– ఎటువంటి బాధ్యతలు, బాంధవ్యాలు లేకుండా సరదాలు, సంతోషాలతో మీరు ఒంటరిగా ఉండాలని కోరుకుంటున్నారు అనిపిస్తున్నది. నీవు ఇండియా రావటానికి ఇది కుంటిసాకుగా ఉంది. అసలు ప్రేమ, అనురాగం అంటే ఏమిటి? అవతలి వ్యక్తులు ముఖ్యంగా మన అనుకునేవాళ్ళ ప్రవర్తన ఎలా ఉన్నా మనం వారిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించటం. వాళ్ల బాధను పంచుకోవడం, వాళ్ళ అభిప్రాయాలు గౌరవించడం. అక్కడ మనవాళ్ళు అంటే కేవలం భార్యా భర్త, ఒకరో ఇద్దరో పిల్లలు అని కాదు అర్థం. తల్లితండ్రులు, తోబుట్టువులు, వాళ్ళ సంతానం కూడా మనవాళ్లే, మన కుటుంబ సభ్యులే. ఇంత మందిలో ఏదో ఒక విషయంలో పొరపచ్చాలు రావటం సహజం. అలాంటి సందర్భంలోనే మనసులోని బాధని పంచుకోవడానికి మనవాళ్లు కావాల్సి వస్తారు. అలా అనుకోబట్టే కదా మామయ్య నిన్ను చూడగానే తన మనసులోని బాధ చెప్పుకున్నాడు.

నీవన్నట్లు కొంతమందిలో ఈర్ష్యాద్వేషాలు ఉండవచ్చు. ఒక మహనీయుడు అన్నట్లు– బంధాల తోటలో వేపచెట్టు లాంటి బంధం కూడా ఉంటుంది. అయితే ఆ వేపచెట్టు చేదుని ఔషధంగా మార్చుకోగలిగే విధంగా మన ప్రవర్తన ఉంటే ఈ జగత్ అంత ప్రేమమయంగా కనబడుతుంది.

ప్రేమ ఆప్యాయతలు అనేవి ఒక అంతర్వాహిని లాంటివి. ప్రతి మనిషిలో ఏదో ఒక మూల బాధ్యతల మరుగున ఇవి దాగి ఉంటాయి. వాటిని గుర్తించి వెలికి తీసి ప్రేమ అనే ఆ నీటిని తాగటం మన చేతుల్లో ఉంటుంది. అది ఇండియా కానీ, అమెరికా కానీ, ఆస్ట్రేలియా కానీ. ఇవన్నీ నీకు తెలియనివి అని కాదు నా ఉద్దేశం. దేశంకాని దేశంలో అయినవాళ్ళకి దూరంగా ఉంటూ నా ఉద్యోగం, నా భార్య, నా పిల్లలు అనే చిన్న వృత్తంలో ఉంటున్న నీ లాంటివాళ్ళు ఆ పరిస్థితి దాటి బయటికి వచ్చి చూస్తే భిన్నత్వంలో ఏకత్వం మని మన భారతీయ కుటుంబ వ్యవస్థ, ప్రేమ, ఆప్యాయతలు తెలుస్తాయి. అంతేకానీ రెండు రోజులు సరదాగా కలిపి ఎంజాయ్ చేస్తే అది ప్రేమ అనిపించుకోదు" సుదీర్ఘంగా మాట్లాడింది హారిక.

ఆ నిశ్శబ్దంలో కొన్ని నిమిషాలు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

కిరణ్ మనసులో ఇప్పుడు తనని చూడగానే ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న పెద్ద మేడ మామ, అంత కోపంలోనూ తన ఇష్టాయిష్టాలను గుర్తుంచుకున్న చిన్న అత్తయ్య ప్రేమ, తన అడగకుండానే తన అవసరాలు గుర్తించి మౌనంగా వాటిని నెరవేర్చే తండ్రి, బాధపెట్టే విషయాలు తన దాకా రానివ్వకుండా కేవలం ప్రేమను మాత్రమే పంచే తల్లి, కృష్ణుడిలా తనకి హితబోధ చేసిన అక్క, సోదరుడిలా అభిమానించే బావ, తను పట్టించుకోకపోయినా తన యోగక్షేమాలు అడిగి తెలుసుకునే మేనత్తలు అందరూ గుర్తొచ్చారు. వీరందరి ప్రేమ ముందు తన చాలా మరుగుజ్జు అనే భావన కలిగింది కిరణ్‌కి.

"ఏరా, ఇన్ని రోజులు సరదాగా ఉండి వెళ్ళబోయే ముందు నీ మూడ్ పాడు చేశానా?" అంది హారిక ప్రేమతో.

"లేదక్కా, ముందుగా నాలోని అంతర్వాహిని గుర్తించి వెలికి తీసి, అందరికీ పంచే ప్రయత్నంలో ఉన్నా" అంటూ నవ్వాడు కిరణ్.

హారిక ఆ నవ్వుతో శృతి కలిపింది. వారిద్దరి నవ్వులతో అమావాస్య చీకట్లో వెన్నెలలు కురిసాయి.

**"ట్యాంక్‌బండ్ సన్నని నడుం చుట్టూ చెయ్యి చుట్టి**
**అందమైన నగర ముఖాన్ని దగ్గరగా తీసుకుని**
**ఆశలతో అలసమైన అబిడ్స్ కళ్లలోకి చూసి**
**దీపాల వెలుతురు ప్రతిఫలించే చెక్కిళ్లపై ముద్దు పెట్టుకో"**

అంటారు నగరం మీద ప్రేమగీతంలో, బాలగంగాధర తిలక్ 1956లో. హుసేన్ సాగర్ మీద ఒలికిన వెన్నెలలోంచి ఒక విరహిణి మధుర విషాద గాథ వినిపిస్తుంది. సిగలో 'నౌపహాడ్' నాగరం తళుక్కున మెరుస్తుంది. 'బంజారా హిల్స్' వక్షోజాలుద్రిక్తంగా చలిస్తాయి అంటూనే, ఎదుగుతూన్న నగర సుందరిని ఒదులొదులుగా కౌగలించుకో అంటారు తిలక్ ఆ కవితలో. వచన కవితా సమ్మోహితంగా నగర సౌందర్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు తిలక్. ప్రపంచంలో ఏ నగరం కూడా ప్రేమ స్మృతిగా అంకురించలేదు. రెండు విభిన్న మతాలకు మధ్య స్నేహ మాధుర్యానికి ఈ నగరం ఒక సంకేతం. నగర సుందరి ఆత్మకు అద్దం పట్టాలని ఎందరో కవులు,

**దర్ద్ పురానే యాద్ ఆతీ హై"**

ఒకప్పుడు మన దేశానికి ప్రధాన మంత్రిగా వున్న ఇంద్రకుమార్ గుజ్రాల్ "నేను చూసిన అందమైన హైదరాబాద్ ఏమైంది" అన్నారు. డా.గోవర్ధన శాస్త్రి సియాసత్ ఉర్దూ పత్రికలో 'హైదరాబాద్ కా అంగన్ గాయబ్' అనే వ్యాసం రాసారు. ఇప్పుడు హైటెక్ వైభవాన్ని ప్రపంచానికి సాక్షాత్కరింపచేస్తున్న కాంక్రీట్ ఆకాశహర్మ్యాల 'తెలంగాణ రాష్ట్ర రాజధాని' సాంకేతికగా మహానగరి విలసిల్లుతోంది. నైజాం జమానాలో ఉర్దూ రాజభాషగా రాజ్యమేలిన రోజులలో ఉర్దూ-పర్షియన్ సాహితీ సంగీత వారసత్వం హైదరాబాద్ పుణికిపుచ్చుకుంది. గోల్కొండ సుల్తాన్ మొహమ్మద్ ఖులీ ఖుతుబ్ షా(16-17 శతాబ్దం) ఉర్దూలో ప్రథమ రుబాయి కవిగా చెప్పుకోవచ్చు. సూఫీ తత్వ ఆధ్యాత్మిక సంపన్నంగా ఆలయాలు/దర్గాలలో సౌత్ ఏసియా అంతటా కవులు, సంగీత కళాకారులు, శ్రోతలు వెల్లివిరిసారు. ఘజల్, ఖవాలీ, దాద్రా, తుమ్రీ హిందుస్థానీ

# ఉర్దూ-పర్షియన్ హైదరాబాద్ కీ షాన్

కళాకారులు,

రచయితలు అక్షరాభిషేకం చేసారు.

**"చార్మినార్ మీది చందమామను**
**షాయర్ మనసులోని**
**గంగా జమునీ తహజీబ్‌ను**
**ఎవరూ దొంగిలించలేకపోయారు"**

ప్రస్తుత ఈ కవితా స్పర్శ 'రాజా హైదరాబాదీ' ప్రసిద్ధ కవి ఆశారాజు వెలువరించిన తాజా కవితా సంపుటి "ఏక్ షామ్ చార్మినార్ కే నామ్" లోనిది. హైదరాబాద్‌లో లోగడ ఏ ముషాయిరా జరిగినా జహాందార్ అఫ్సర్ అనే సుప్రసిద్ధ ఉర్దూ కవి తాను రాసిన 'చార్మినార్' తప్పక వినిపించేవారని, హైదరాబాద్ ప్రేమికుడు పైదాయిషీ హైద్రాబాదీ, ప్రముఖ రచయిత పరవస్తు లోకేశ్వర్ 'సలాం హైదరాబాద్' రచనకు రాసిన ప్రస్తావనలో, ఎన్నో విధాల గౌరవనీయులు అయిన సామల సదాశివ పేర్కొన్నారు. పురాతన నగర సంస్కృతీ సంప్రదాయాలను ప్రేమించే వారందరి తరపున లోకేశ్వర్ 'సలాం హైదరాబాద్' నవలగా రాసారు.

ఢిల్లీ, లక్నో నగరాలకు దీటైన సమవుజ్జీ నగరం 'చార్ సౌ సాల్ పురానా షహర్‌'గా హైదరాబాద్ నేడు విశ్వనగరి అయింది. కానీ భారతావనికి, తెలంగాణ సీమకు గర్వకారణమైన నగర సుందరి ఆత్మ కాలగర్భంలో కరిగి కనుమరుగవుతోంది. నగర మనోహరి ముక్కుపుడకలా తళుక్కున మెరిసే మేలిమి ముత్యం చార్మినార్ 'హైదరాబాద్ కీ షాన్ ఔర్ షౌరత్' నేడు ఒంటరిగా జ్ఞాపకాల తలపోతలతో నగర చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా నిర్వేదం సాక్షాత్కరిస్తోంది. అదీ కాల మహిమ.

**"గుజ్రే జమానే యాద్ ఆతీ హై**



సంగీత శాస్త్రీయ ధ్రుపద్, ఖైల్ వగైరాలు ఉర్దూ కవిత్వంలో పర్షియా నుంచి ప్రభావితం పొందాయి. అందులో రుబాయి, ఘజల్, ఖతా, నజ్మ్, మర్సియా, ఖవాలీ, హమ్ద్, నాట్, మస్నావి, ఖసీదా, హిజ్వ్-మదహ్, ముస్సాద్దాస్ వంటి కవిత్వ-సంగీత ప్రక్రియలు ఉర్దూలో సంగీత, సాహితీ సమ్మేళనంగా వారసత్వం అందించాయి. ఖులీ ఖుతుబ్ షా కాలంలో దక్కన్‌లో ప్రభవిల్లిన మార్సియా ఉర్దూ కవితా ప్రక్రియ ఉత్తర భారతావనిలో ఢిల్లీ, లక్నో కళాకారుల ప్రఖ్యాతి పొందింది. మధ్య యుగానికి సంబంధించిన రొమాన్‌టిక్ కవిత్వం వాస్తవిక భావాల నుండి కాల్పనిక జగత్తులోకి భాష, భావాలు సంతరించుకుని అపురూప తన్మయత్వంతో శ్రోతలను ఉర్రూతలూగించే మార్మిక కవిత్వానికి దార్శనికత వహించింది.

పర్షియన్ కవితా ప్రక్రియలో సుపరిచితమైన 'ఖసీదా' ప్రక్రియను మొహమ్మద్ ఖులీ ఖుతుబ్ షా ఉర్దూలోకి ప్రవేశపెట్టాడు. రాచరిక వ్యవస్థ సమూల నిర్మూలనంతో ఖసీదా వంటి కవితా ప్రక్రియ రూపాలు క్రమేపీ క్షీణించి తీవ్ర తిరస్కరణలతో కాలగర్భంలోకి కనుమరుగయ్యాయి. 21వ శతాబ్దంలో ప్రపంచం డిజిటల్ యుగాన్ని ఆవిష్కరించిన ప్రస్తుత తరుణంలో మహానగరాల స్వరూప స్వభావాలు మారిపోయాయి.

సహజంగా పురాతన సంస్కృతి, సాహిత్య విలువలు చెరిగి చెదిరి కరిగిపోతున్నాయి. కానీ ప్రాచీన నగర శిథిలావశేషాల చరిత్ర పునాదులపై పర్షియన్-ఉర్దూ సంగీత, సాహితీ స్వర సమ్మేళనం ప్రతిధ్వనిస్తోంది.

**- జయసూర్య**

# పుస్తకాన్ని మించిన మిత్రుడు లేడు..



పుస్తకాలు పకరిస్తాయి.. చదివిస్తాయి. పుస్తకాలు వెన్ను తడతాయి.. పుస్తకాలు భరోసానిస్తాయి. పుస్తకాలు ఆలోచింపచేస్తాయి.. తోడుంటాయి.. దారి చూపుతాయి. ఒకానొకప్పుడు పుస్తకాలు/ మాసపత్రికలు కొనలేని స్థితిలో ఉన్నా పాత పుస్తకాలమ్మే దుకాణాలకు తప్పనిసరిగా వెళ్ళి అక్కడి పుస్తకాలను చూసొచ్చేవాడిని. మద్రాసులో ఉన్న రోజుల్లో సెంట్రల్ స్టేషన్ పక్కనున్న మూర్ మార్కెట్టులో ఉండే పాత పుస్తకాల దుకాణాలు, మైలాపూరులో లజ్ కార్నరులో ప్లాట్ ఫారంమీద ఆళ్వార్ అనే ఆయన అమ్మే పుస్తకాల దుకాణం, అలాగే ట్రిప్లికేన్, ఆర్కాట్ రోడ్డు, రంగరాజపురం రోడ్డులో పాత పుస్తకాలమ్మేవాళ్ళు ఉండేవాళ్ళు. ఇక నా మకాం హైదరాబాదుకి మారిన తర్వాత అబిడ్స్ సర్కిలు పరిసరాలలో ఆదివారాలు పేవ్‌మెంట్ మీద అమ్మే పుస్తకాలపై నా దృష్టి పడింది. ఇక్కడికి ప్రతి నెలా వెళ్ళేవాడిని. అలాంటిది ఇప్పుడు ఎంత కాలమైందో చెప్పలేను. అందుకు కారణం, చేతిలో డబ్బులు అస్సలు ఆడకపోవడమే. పైగా మోకాళ్ళ నొప్పులతో అంతంత దూరం వెళ్ళడానికి శరీరం సహకరించడం లేదు.

దాంతో ఇంటిపట్టునే ఇంటర్నెట్‌లో పుస్తకాలు వెతికి ఏవన్నా అందుబాటులో ఉంటే చదువుతున్నాను. కానీ చేత్తో పుస్తకం పట్టుకుని చదివేటప్పుడు కలిగే అనుభూతి ఇంటర్నెట్‌లో చదివేటప్పుడు కలగడం లేదు. పుస్తకాల మీద నాకున్న బంధం ఎన్నో ఏళ్లుగా వస్తోంది.

ఆ మధ్య దాదాపు ఓ ముప్పై నలభై పుస్తకాలు చెదలపాలవడంతో మిగిలిన పుస్తకాలను పాడవకుండా ఉండటం కోసం ఇచ్చేశాను ఒకరిద్దరికి. ఇప్పుడు నా దగ్గర ఉండిపోయిన అతి తక్కువ పుస్తకాలను ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నాను. ఇంట్లో నేను కూర్చునే చోట, పడుకునే చోట పక్కనే కనిపించేటట్టుగా పుస్తకాలను సర్దాను. వాటిని చూస్తూ చదువుతూ నచ్చిన విషయాలుంటే అండర్‌లైన్ చేసుకోవడం అలవాటు.

పుస్తకాలతో బంధం చిన్నప్పటి నుంచే మొదలైంది. మా నాన్నగారు యామిజాల పద్మనాభస్వామిగారి దగ్గర బోలెడు పుస్తకాలుండేవి. వాటిని నాన్నగారు ఎంత జాగర్తగా చూసుకునేవారో ఎరుగుదును. ఆయన రాసుకునే చోట పక్కనే డైరీలు, ఆమరకోశం, మరో మూడు నాలుగు పుస్తకాలు తప్పనిసరిగా ఉండేవి. మిగిలినవి బీరువాలో భద్రపరిచారు. ఆయన గతించిన తర్వాత ఆ పుస్తకాలను మా తమ్ముడు గణపతి ఆయన పని చేసిన శ్రీ శారదా విద్యాలయ గ్రంథాలయానికి ఇచ్చేశాడు. అలాగే రెండో అన్నయ్య ఆనంద్ నుంచీ పుస్తకాలెన్నో చదివాను. చూశాను. నా జీవితం పుస్తకాలతో పెనవేసుకోవడం ఆనందమే. పుస్తకాలను గౌరవించే వారెందరో ఉన్నా వాటిని చదివేవారి రోజుల్లో చాలా తక్కువ మందే అన్పిస్తోంది.

నాకో మిత్రుడుండేవాడు. అతను పుస్తకం కొనడం నేనెరగను. కానీ వాడి దగ్గర బోలెడు పుస్తకాలుండేవి. నువ్వసలు పుస్తకం తిరగేయవుగా.. అంటే "అబ్బే నేనెక్కడ కొంటాను. అవన్నీ ఎవరో ఒకరు చదవమని ఇస్తే తిరిగిచ్చే సద్గుణం నాకు లేదుగా?" అన్నాడు నవ్వుతూ. నిజమైన పాఠకుడు పుస్తకాన్ని తిరగేయకుండా ఉండలేడు జీవితంలో. మంచి పుస్తకం కంట పడి చదివే అవకాశముంటే చదివెయ్యాలి. ఆలస్యం చేస్తే ఆ అవకాశాన్ని కోల్పోవచ్చు.ఓ రచయిత ఓ పుస్తకాన్ని రాయడం మొదలుపెడితే పాఠకుడు దానిని చదివినప్పుడే ఆ పుస్తకజీవితం ధన్యమైనట్టు.

పుస్తకాలను చదవటం మాని మనుషులను చదవటం మొదలుపెట్టు అనే వారున్నారు. కాదనను. ఇది నిజమే కావచ్చు కానీ పుస్తకాలు లేని ఇల్లు ఆత్మ లేని గూడైపోతుంది. ఈ మధ్య ఓ తమిళ దర్శకుడు పుస్తకాల గురించి చెప్తూ తాను శుభకార్యాలప్పుడు పుస్తకాలనే కానుకగా ఇస్తుంటానన్నారు. కొందరు పుస్తకాలను ఓ అలంకారప్రాయంగా సేకరిస్తుంటారు. అందువల్ల దమ్మిడీ లాభం లేదు. పూస్తకాలలోని విషయాన్ని మెదడులోకెక్కించరు. అటువంటివారి నుంచీ పుస్తకాలను దోచెయ్యాలనిపిస్తుంది.

## పుస్తకాలు వెలకట్టలేని ఆణిముత్యాలు

పుస్తకాలలో కొన్నింటిని చదవాలి. చదివిన వాటిలో కొన్నింటిని నెమరేయాలి. ఇంకొన్నింటిని జీర్ణించుకోవాలనే పెద్దల మాటతో ఏకీభవిస్తాను. కొన్ని పుస్తకాల ముఖచిత్రాలు ఆకర్షణీయంగా ఉంటాయి కానీ లోపలి పేజీలు తిరగేస్తే విషయముండదు. అందుకే అంటారేమో, చదవడం.. ఆలోచించడం.. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఆచితూచి అడుగేయాలని. పుస్తకాలు ఆలోచనలను పుట్టించేందుకు దోహదపడతాయి.

పుస్తకాలతో దోస్తీ కడితే అంతకన్న మంచి మిత్రుడు మరొకడుండడు. పుస్తకాలు మనుషులను సృష్టిస్తాయి.. మనుషులను చైతన్యపరుస్తాయి.. కొన్ని విప్లవాలకు పుస్తకాలే కారణమయ్యాయి. ఏకాంతంలో పుస్తకాలిచ్చే తోడు ఇంకెవరివ్వగలరు. పుస్తకాలతో బతికేవారికి జీవితం ఎప్పుడూ వసంతకాలమే. అందుకే పుస్తకపఠనాన్ని మానకూడదు.

**- యామిజాల జగదీశ్**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458




# రెండు గేట్లు పెట్టవచ్చా?

**సి.మధుకర్, గుంటూరు**

**ప్రశ్న: మా ఇల్లు సుమారు 300 అంకణాలు. చుట్టూ పెద్ద కాంపౌండ్ గోడ కట్టాలి. పెద్ద గేట్లు పెట్టాలి. తూర్పు ఈశాన్యం, ఉత్తర ఈశాన్యంలో పెద్ద గేట్లు పెట్టాలనుకుంటున్నాం. సలహా చెప్పగలరు.**

**జవాబు:** ప్రహరీ గోడలకు ఈశాన్యంలో గేటును అమర్చటం వాస్తుకు విరుద్ధం కాదు. ఐతే అందుకు అవసరమైన నియమాలను పాటించవలసి వస్తుంది. రెండు ఈశాన్యాలలో రెండు గేట్లు అమర్చడం వలన వాటిని తెరిచినప్పుడు ఒక గేటు లోపలికి మరొక గేటు తలుపులు రాకుండా జాగ్రత్త పడాలి. గేటుకు ఎదురుగా బావులు, బోరుబావులు, సెప్టిక్ ట్యాంకులు, నీళ్లసంపులు మొదలైన గోతులు రాకూడదు. గేటు వెలుపలి వైపు కానీ, బయటవైపుగానీ స్థంభాలు, మూలలు, శిథిలాలు, టాయిలెట్స్ గేటులోకి పడే విధంగా వుండకూడదు. ఒక గేటు తూర్పు ఈశాన్యంలో తీసుకున్నప్పుడు మరొక గేటు అనువైన చోట ఉత్తరంలో, ఉత్తర ఈశాన్య మూలకు దూరంగా అమర్చుకోవాలి. అలాగే ఉత్తర ఈశాన్య మూలన గేటు తెరిస్తే మరొకటి తూర్పు మధ్య భాగంలో అమర్చుకోవాలి.

## ప్రత్యామ్నాయం..?

**ఎస్.వాసుదేవ్, చిట్యాల**

**ప్రశ్న: ఈ ఇంట్లోకి వచ్చి మూడు సంవత్సరాలకు పైన అయింది.... ఏం చేయమంటారు?**

**జవాబు:** మీరు రాసిన అనేక వివరాలు చదివాను. ఇంటి ప్లాను చూసాను. కానీ వివరంగా లేదు. చిన్న చిట్కా చెబుతాను. ముందు అది పాటించండి. మీ భారం కొంత తేలిక అవుతుంది. ప్రతి మంగళవారం 8 గంటల తరువాత మీరు పూజ చేసే చోట దీపారాధన చేయండి. లేదా అగరొత్తులు వెలిగించండి. ఇంట్లోని అన్ని గదుల్లో సాంబ్రాణి ధూపం వేయండి. మీరే కాదు.. మీలాగే ఆర్థిక పరమైన సమస్యలు, మనస్థాపానికి సంబంధించిన అనేక సమస్యలు తీవ్రంగా వున్నవాళ్లు ఎవరైనా సరే వారి గృహంలో ఈ విధంగా 'ధూపక్రియ' చేయటం వల్ల శీఘ్రమే ఊరట లభిస్తుంది. ఎవరైనా చేయవచ్చు.

## గృహం నిర్మించవచ్చా?

**ఎల్.ఎమ్, నంద్యాల**

**ప్రశ్న: ప్లాన్‌లో చూపించిన విధంగా స్థలంలో రెండు బోర్లు ఉన్నాయి. స్థలానికి రెండు వైపుల రోడ్డు వున్నది. స్థలంలో 'దిక్సూచి' మూలలకు ఉత్తర, దక్షిణ దిక్కులు చూపిస్తున్నాయి. నేను ఈ స్థలం కొని నిర్మాణం చేసుకోవచ్చా?**

**జవాబు:** ఈ క్షేత్రంలో ఈ విధంగా బోరుబావులు ఉండటం దోషం కాదు. దిక్కులు మూలలకి; మూలలు దిక్కులకి రావటం వలన ఇటువంటి స్థలాలను 'దిగ్మూఢం' ఏర్పడిన స్థలాలుగా నిర్ధారించవలసి ఉంటుంది. ఈశాన్య దిక్కులో కూడా ఈ స్థలానికి వీధి ఉన్నది. కాబట్టి ఈ స్థలంలో 'ఈశాన్య ముఖ ద్వార గృహాన్ని' మాత్రమే నిర్మించాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఇవి వాస్తు ప్రాముఖ్యత సంతరించుకున్న స్థలాలు కావు. తప్పనిసరిగా గృహ నిర్మాణం గావించవలసి వస్తే పైన చెప్పిన విధంగా నిర్మించుకోవచ్చు.

## ఏ ముఖద్వారం యోగిస్తుంది?

**కె.కె, నిజామాబాద్**

**ప్రశ్న: నాకు ఏ విధమైన ముఖద్వారమున్న ఇల్లు పనికొస్తుంది? నాకు ఉత్తరంలో వున్న స్థలం ఉన్నది. అక్కడ ఇల్లు కట్టుకోవచ్చా?**



**జవాబు:** మీ వ్యవహార నామరీత్య మీకు 'దక్షిణ ముఖ ద్వార గృహం' యోగిస్తుంది. దక్షిణ వీధి వున్న స్థలంలో మాత్రమే దక్షిణ ముఖ ద్వార గృహం నిర్మించాలి. 'ఆగ్నేయ స్థలం'లో కూడా అంటే 'తూర్పు, దక్షిణాలలో వీధులున్న స్థలం'లో కూడా దక్షిణ ముఖ ద్వార గృహం కట్టకూడదు. మీకున్న ఉత్తర స్థలంలో ఉత్తర ముఖ ద్వార గృహం వాస్తు ప్రకారం కట్టుకున్నట్లయితే సాధారణ ఫలితాలుంటాయి. దక్షిణ వీధి ఉన్న స్థలంలో వాస్తు ప్రకారం దక్షిణ ముఖ ద్వారా గృహాన్ని నిర్మించుకున్నట్లయితే ఫలితాలు చాలా బాగుంటాయి. దీనినే 'యోగించటం' అంటారు.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:...............................................

ఆలయ దర్శనం

# రాహు, కేతు దోష నివారణ క్షేత్రం

మనం గమనించం కానీ చుట్టుపక్కల గ్రామాలలో, పట్టణాలలో చివరికి మనం నివసించే నగరంలో ఎన్నో అద్భుత రమణీయ విశేష ఆలయాలు కనిపిస్తాయి. ఆ క్షేత్రాలలో మనం ఎప్పుడూ చూడని, వినని విశేషాలు కనిపిస్తాయి. అదంతా మన పూర్వీకుల గొప్పదనం, ముందుచూపు. భావితరాలకు మనవైన సంస్కృతీ, సంప్రదాయాలను, చరాచర సృష్టికర్త గురించి తెలియచేయాలన్న సంకల్పం ఈ ఆలయాల నిర్మాణ వెనుక ఉన్న ముఖ్య కారణం.

అందుకే చిన్న చిన్న, మారుమూల గ్రామాలలో కూడా నేటికీ పురాతన విశేష ఆలయాలను దర్శించుకోగలుగుతున్నాం. ఈ ఆలయాలు సందర్శకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయి. ఎందుకంటే అలాంటి ఆలయాలు ఉన్నాయని తెలియకపోవడమే!

ఉదాహరణకు దశావతార ఆలయాలనే తీసుకొందాం... కేరళ రాష్ట్రం తరువాత శ్రీహరి పది అవతార రూపాల ఆలయాలున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. లోక సంరక్షణార్ధం వైకుంఠ వాసుడైన శ్రీమన్నారాయణుడు ధరించిన అవతారాలు నిత్య స్మరణీయం, పూజనీయం.

దశావతారాలలో అధికంగా కనిపించే ఆలయాలలో శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీ నరసింహ, శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనమిస్తారు. మిగిలిన అవతారాల ఆలయాలు అక్కడక్కడ మాత్రమే కనిపిస్తాయి. అలాంటి వాటిలో క్షీరసాగర మథనంలో మందర పర్వతం మునిగిపోకుండా కూర్మ రూపం ధరించి నిలువరించారు శ్రీ కూర్మనాథుడు. ఆయనకు ఆలయం ఎక్కడ ఉందనగానే వెంటనే అందరికీ గుర్తుకు వచ్చేది శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 'శ్రీకూర్మం'. కానీ స్వామివారికి ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు ఆలయాలు కూడా ఉన్నాయి. వాటిల్లో మొదటిది: చిత్తూరు జిల్లాలోని కూర్మై గ్రామంలోని శ్రీ కూర్మ వరదరాజ స్వామి ఆలయం. ఈ క్షేత్రం పలమనేరు పట్టణానికి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రెండవది: నల్లగుట్ట శ్రీ కూర్మనాథ క్షేత్రం. హాలిగేరే, ఆస్పరి మండలం, కర్నూలు జిల్లాలో ఉంటుంది ఈ విశిష్ట క్షేత్రం.

## క్షేత్ర గాథ

క్షీరసాగర మథనం మనందరికీ తెలిసిన గాథ. దేవదానవులు కలిసి పాలకడలిని మర్దించి అమృతం పొందాలన్న ఆకాంక్షతో చేసిన గొప్ప కార్యం. చిలకడానికి కవ్వం కింద 'మందర పర్వతం', కవ్వానికి కట్టే తాటి కింద సర్పరాజైన 'వాసుకి'ని ఎంచుకొన్నారు. కానీ పర్వతం సరిగ్గా నిలవకపోవడం, సముద్రంలో మునిగిపోవడంతో అనుకున్న కార్యక్రమం సజావుగా సాగలేదు. దేవతల ప్రార్థన మన్నించి శ్రీమహావిష్ణువు కూర్మ రూపం దాల్చి మందర పర్వతాన్ని మునిగిపోకుండా తన మీద ఉంచుకొన్నారు.

లోకసంరక్షణకు, సర్వలోక వాసులకు శుభం కలిగించే చంద్రుడు, కల్పవృక్షం, కామధేనువు, ఐరావతం, అప్సరసలు, ఉచ్ఛ్శ్వం, పారిజాతం, కౌస్తుభం, శ్రీ మహాలక్ష్మి, హాలాహలం, శ్రీ ధన్వంతరీ, అమరత్వాన్ని అందించే అమృతం ఈ సాగర మథనం వలన వెలికి వచ్చాయి.

హాలాహలాన్ని స్వీకరించిన మహేశ్వరుడు 'గరళ కంఠుడు' అయ్యారు. చంద్రుడు వెన్నెల రేడు. చంద్రశేఖరుని శిరస్సున కొలువైనాడు. శ్రీహరి, మోహినిగా అమృతాన్ని పంచుతున్న సమయంలో తమకు దక్కడం లేదు.. అన్న అనుమానంతో దేవతల వరుసలో నిలబడి అసురుడైన 'రాహువు' అమృతం స్వీకరించాడు.

గమనించిన సూర్య చంద్రులు సైగ చేయడంతో చక్రధారి సుదర్శనంతో రాహువును ఖండించారు. కానీ అమృతం సేవించడం వలన శిరస్సు, శరీరం కూడా సజీవంగా ఉండి 'ఛాయా గ్రహాలు'గా గుర్తించబడ్డాయి.

తమ గుట్టు రట్టు చేసిన సూర్య-చంద్రుల మీద ఆగ్రహంతో వారిని కబళించడానికి ప్రయత్నం చేస్తుంటారు రాహు-కేతువులు. కలిసి కృషి చేసినప్పటికీ అమృతం లభించని అసురులు సురుల చేతిలో పరాజయం పొందారు అన్న విషయం చెప్పనవసరం లేదు. ఇదంతా జరిగింది హాలిగేరేలో అని స్థానిక గాథలు తెలుపుతున్నాయి.

## క్షేత్ర విశేషాలు

కూర్మ రూపంలో నల్లటి కొండరాళ్లతో గుట్టగా ఏర్పడిన నల్ల గుట్టను నాటి మందర పర్వతంగా పేర్కొంటారు. గుట్ట పైభాగాన 'అమృత కలశం' రూపంలో ఉన్న రాయి ప్రత్యేక ఆకర్షణ. కొండ రాళ్ళ మధ్య సహజ సిద్ధంగా ఆదిశేషువు పడగల మాదిరి ఏర్పడిన గుహలో శ్రీ కూర్మనాథ స్వామి కొలువై ఉంటారు.

గుహను చేరుకోడానికి సోపాన మార్గం ఏర్పాటు చేశారు.



తొట్టతొలిసారిగా గుహలో ఉన్న శ్రీ కూర్మనాథ స్వామిని కీర్తిశేషులు అయిన శ్రీ అంజన్న అనే స్థానిక భక్తుడు గుర్తించారట. అప్పటి నుండి స్వామి సేవలో జీవితం గడిపి ఐక్యం అయ్యారని చెబుతారు. గుట్ట కింద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసారు.

గుహలో స్వామివారు తన నిజరూపమైన కూర్మ శరీరంతో దర్శనమిస్తారు. పక్కనే హాలాహలాన్ని అమృతంగా స్వీకరించిన గరళ కంఠుడు లింగ రూపంలో కొలువై ఉంటారు. ఒక పక్కన పెద్ద పుట్ట ఉంటుంది. వాసుకి అంశ అయిన దేవ శ్వేత నాగసర్పం అందులో ఉంటుందనీ, అర్హులకు దర్శనం ఇస్తుంది అని కూడా చెబుతారు. ఈ కారణంగా శ్రీ నల్లగుట్ట కూర్మనాథ స్వామి క్షేత్రం నాగదోష నివారణకు ప్రసిద్ధి. గుట్ట చుట్టూ తొమ్మిది వాల్మీకాలు ఉంటాయి. ప్రతి శనివారం రాహు కాలంలో గిరి ప్రదక్షిణ జరుగుతుంది. ఈ తొమ్మిది పుట్టలను పూజించి, గిరి ప్రదక్షిణ చేసినవారికి సకల శుభాలు కలగడమే కాకుండా జన్మజన్మల నాగ దోషం కూడా తొలగిపోతుందని స్థానికుల విశ్వాసం. నాగప్రతిష్ఠ చేయనవసరం లేదు, స్వామిని దర్శించి మొక్కితే చాలు సర్పదోషం తొలగిపోతుందని అంటారు.



మాయా రూపంలో అమృతం స్వీకరించిన రాహువు శిక్షించబడినది ఇక్కడే కనుక క్షేత్ర సందర్శనతో జాతకరీత్యా ఇబ్బంది పెడుతున్న రాహు-కేతు దోషాలు తొలగిపోతాయి. ఈ దోషాల కారణంగా వివాహం కానివారు, సంతానం లేనివారు, వివిధ కారణాల వలన సత్సంబంధాలు లేని దంపతుల సమస్యలు క్షేత్ర సందర్శనంతో దూరం అవుతాయని చెబుతారు.

## గ్రహణ సమయంలో..

సాధారణంగా సూర్య, చంద్ర గ్రహణ సమయాలలో ఆలయాలను మూసివేస్తారు. కానీ శ్రీ నల్లగుట్ట కూర్మనాథ స్వామి ఆలయం తెరిచి ఉంటుంది. గ్రహణ దోషం, గ్రహణ శూల సోకవని చెబుతారు. గ్రహణ సమయంలో ప్రత్యేక పూజలు కూడా నిర్వహిస్తారు. నిత్యం స్వామి వారికి ప్రీతికరమైన 'వావిలాకులు' (నిర్గుండి)లతో అర్చన చేస్తారు. ఆయుర్వేదం ప్రకారం వావిలాకులు నొప్పులకు, వాపులకు దివ్యమైన ఔషధంగా చెబుతారు. అనంతరం పుష్పాలతో అలంకరిస్తారు.



అత్యంత ప్రశాంత వాతావరణంలో పచ్చని పొలాల మధ్య నెలకొని ఉన్న శ్రీ నల్లగుట్ట కూర్మనాథ స్వామి క్షేత్రం అరుదైన ఆధ్యాత్మిక అనుభూతులను అందిస్తుంది. ఈ ఊరిలో పురాతన విశేష శ్రీ అంజనేయస్వామి వారి దేవస్థానం దర్శనం విశేష ఫలితాలనిస్తుందని ప్రతీతి.

కర్నూలు, పత్తికొండ, ఆదోని నుండి ఆస్పరి చేరుకోడానికి బస్సులు లభిస్తాయి. అక్కడి నుండి ఆటోలో క్షేత్రానికి చేరుకోవచ్చు. ఇక్కడ ఎలాంటి వసతి, భోజన సౌకర్యాలు లభించవు. ఆస్పరి గురించి కూడా రెండు మాటలు చెప్పుకోవాలి. చరిత్రలో తనదైన స్థానం కలిగిన ఊరు ఆస్పరి. గతంలో రాజులూ వారి సైన్యం ఇక్కడ ఉన్న చెఱువు పక్కన ఉన్న విశాలమైన ప్రదేశంలో విశ్రాంతి తీసుకొనేవారట. ప్రయాణంలో అలసిన గుర్రాలకు కావలసిన గడ్డి, నీరు లభించేవి. అందువల్ల 'అశ్వపురి' కూడా పిలిచేవారట. కాలక్రమంలో ఆస్పరిగా మారిందని చెబుతారు. ఈ మండల కేంద్రంలో శతాబ్దాల క్రితం నిర్మించిన శ్రీ వినాయక, శ్రీరామ, శ్రీ గాయత్రీమాత, విశేష షట్కోణ బ్రహ్మసూత్ర శివాలయం కూడా ఉన్నాయి. ముఖ్యంగా శ్రీ గాయత్రీదేవి ఆలయంలో నిత్య పూజలతో పాటు ఎన్నో ఉత్సవాలను, నామ సంకీర్తనలు, కుంకుమ పూజలు, నవరాత్రి ఉత్సవాలను విశేషంగా నిర్వహిస్తారు.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# నాటి పాటలీపుత్రం నేటి పాట్నా

భారతదేశంలో మకుటాయమానంగా శతాబ్దాల పాటు వైభవ ప్రాభవాలతో విరాజిల్లిన నగరం పాట్నా ఇది బీహార్ రాష్ట్ర రాజధాని నగరం. పాట్నా చరిత్ర చాలా ప్రాచీనమైనది. దీని పూర్వపు పేరు పాటలీపుత్ర. దీన్ని పాటలీపుత్రం అని కూడా పిలుస్తారు.



పాటలీపుత్రం మౌర్య, గుప్త, నంద, హర్యంక, సుంగ, పాల వంశాల రాజధానిగా విలసిల్లింది. ఈ నగరం చాణక్యుడు, చంద్రగుప్త మౌర్యుడు. అశోకుడు వంటి చారిత్రక వ్యక్తులతో ముడిపడి ఉంది. క్రీ.పూ.5వ శతాబ్దంలో స్థాపించిన ఈ నగరం కళలు, విజ్ఞానం, వాణిజ్యం, రాజకీయాల కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. పాటలీపుత్ర నగరం నలంద, విక్రమశిల వంటి ప్రసిద్ధ విద్యా కేంద్రాలకు దగ్గరగా ఉండేది. బౌద్ధ, జైన సంస్కృతికి సంబంధించిన అనేక ప్రదేశాలు ఇక్కడ ఉన్నాయి. భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన నగరాలలో పాట్నా 14వ స్థానం ఆక్రమించుకుంది. పాట్నా నగరం గంగానది దక్షిణతీరాన కేంద్రీకృతమై ఉంది. ఇదే నగరంలో కోసీ, సోన్, గండక, పునున్ ఇత్యాది నదులు కూడా ఉన్నాయి. అజాతశత్రువు నిర్మించిన సామ్రాజ్యపు రాజధాని పాటలీపుత్రం తరువాతి కాలంలో మహాపద్మనందుడు నంద వంశాన్ని మగధలో సుస్థిరం చేశాడు.

అప్పట్లో దాదాపు ఉత్తర భారతమంతా మగధ సామ్రాజ్యమే. ఈ నందుల కాలంలో (క్రీ.పూ 343-322)నే అలెగ్జాండర్ దండయాత్ర జరిగింది. కానీ అతడు బియాస్ నదిని దాటి ముందుకు రాలేదు. అలెగ్జాండర్ తిరిగిపోవడానికి అంతర్గత విషయాలతో పాటు మగధ సామ్రాజ్యపు శక్తి సంపత్తులు కూడా కారణమంటారు. తరువాత చాణక్యుని సారథ్యంలో చంద్రగుప్తుడు నంద వంశాన్ని కూలదోయటంతో మౌర్యవంశ స్థాపన జరిగింది. ఈ వంశంలో బింబిసారుడు సామ్రాజ్యాన్ని విస్తరించి అలెగ్జాండరు ప్రతినిధిగా పంజాబును పాలిస్తున్న సెల్యూకస్‌ను ఓడించి అతని కుమార్తెను వివాహమాడాడు.

ఈ వంశంలో మహోన్నతుడుగా వెలిగినవాడు అశోకుడు. ఇతని కాలం నాటి శాసనాలన్నీ బ్రాహ్మీలిపిలోనే ఉండడంతో అదే భాష అప్పుడు ప్రాబల్యంలో ఉన్నట్టు చరిత్రకారులు భావిస్తున్నారు.

## కుంహరార్లో చారిత్రక చిహ్నాలు

పాట్నాలో ఒక పక్కనున్న ప్రాంతాన్ని కుంహరార్ అంటారు. ఇక్కడ చారిత్రక సామ్రాజ్యపు చిహ్నాలు బయట పడ్డాయి. అయితే అక్కడ తవ్వకాలు పెద్దగా జరిగిన జాడలేమీ లేవు. ఇక్కడ ముఖ్యంగా వెలసింది మౌర్యుల దర్బార్. ఇది ఒకప్పుడు 100 స్తంభాలతో తీర్చిదిద్దిన సభామండపం. వీటిలో కొన్ని స్తంభాలు ఈనాటికీ నిలిచి వున్నాయి. దీని పక్కనే అశోకుని శిలాస్తంభం ఉంది. దీన్ని ఏకశిలతో మలచి అద్దంలాగా మెరుగులు దిద్దారు. ముక్కలుగా విరిగిపడి ఉంటే వాటిని భద్రపరిచారు. సామాన్యంగా అశోకుని స్తంభాల మీద ఉండే మకుటం ఇక్కడ లభించలేదు. ఇక్కడి నుంచి తూర్పుగా కొంత దూరంలో బౌద్ధారామ అవశేషాలున్నాయి. అలనాటి పాటలీపుత్రం భారతదేశపు రాజకీయ చైతన్యానికి కేంద్రబిందువు. మగధ సామ్రాజ్యం ప్రజల ధార్మిక జీవనానికీ, సుఖశాంతులకు ప్రతీకగా నిలిచి, స్వర్ణయుగంగా ప్రశంసలు అందుకుంది. ఇక్కడ తవ్వకాలు పూర్తి స్థాయిలో జరిపితే 2500 సంవత్సరాలనాటి మరిన్ని విశేషాలు బయట పడవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. కాంక్రీటు కట్టడాలతో అన్ని నగరాల మాదిరి వున్నా ఊరికి మధ్య చాలా పెద్ద పార్కు ఒకటి వుంది. ఈ ఉద్యానవనాన్ని చూసిన పర్యాటకుల మనసు ఒక్కసారిగా సేద తీరుతుంది. దీన్ని గాంధీ మైదాన్ అంటారు. నగరంలోని ముఖ్యమైన సభలన్నీ ఇక్కడే జరుగుతున్నాయి. ఇక్కడి సెక్రటేరియట్‌కు ఎదురుగా వున్న చౌరాస్తాలో ఒక స్మారక చిహ్నం ఏర్పాటు చేశారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం సాగుతున్నపుడు ఆరుగురు విద్యార్థులు కాంగ్రెస్ పతాకాన్ని ఆనాటి బ్రిటిష్ సచివాలయం మీద ఆవిష్కరింపజేయడానికి ప్రయత్నించారు. అప్పుడు బ్రిటిష్‌వారు జరిపిన కాల్పుల్లో వారు తమ ప్రాణాల్ని కోల్పోయారు. అలా వీరమరణం పొందిన వారి విగ్రహాలతో నిర్మించిన స్మారకచిహ్నమే ఇది.

## పాట్నా మ్యూజియంలో ఎన్నో చారిత్రక జ్ఞాపకాలు..

ఇది తప్పనిసరిగా చూడవలసిన ప్రదేశం. దీనికెన్నో ప్రత్యేకతలున్నాయి. బీహార్ చరిత్ర, కళ, సంస్కృతికి సంబంధించిన అనేక వస్తువులను ఇక్కడ చూడవచ్చు. మొగల్ శిల్పరీతిలో అద్భుతమైన నగిషీలు చెక్కిన బ్రహ్మాండమైన ఈ కట్టడం పాట్నా-గయ రోడ్డుమీద ఉంది. చుట్టూ విశాలమైన పూదోటలు, ఎదురుగా మూడు రకాల మూడు ఫిరంగులు అమర్చారు. వీటికి మధ్య యుగాల చరిత్ర ప్రాధాన్యం ఉంది. లోపల కుడిపక్క గేలరీలో ఒక పెద్ద వృక్షం నేలమీద పరచుకుని ఉంది. అది చూడడానికి రాయిలా మారింది. దాని పొడవు సుమారు 53 అడుగులు. వృక్షం కాండం మీద ముడతలు, ఒంపులూ ఏమీ చెక్కుచెదరకపోవడం విశేషం.

ఇది ప్రకృతిసిద్ధంగానే అలా రాయిలా పరిణామం చెందినట్లు తెలుస్తోంది. ఇక్కడ శిల్పాలు ఎక్కువగా రాజగిరి, నలంద, గయ ప్రాంతాల్లో లభించాయి. వాటిలో పాలరాయి, నల్లరాయి, ఇసుకరాతితో మలచినవి ఉన్నాయి. దాదాపు అన్నీ 1 నుంచి 11వ శతాబ్దం వరకూ వెయ్యేళ్ల కాలానికి చెందినవిగా చారిత్రక సమాచారం ఉంది. కొన్ని శిల్పాలలో అమర్చిన సౌందర్యసంపద మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. వివిధ ముద్రలలో వున్న బుద్ధుడు, ఈశ్వరుడు. తారాదేవి శిల్పాలు ఆనాటి సౌందర్య పిపాసను చాటిచెబుతాయి. సారన్ జిల్లాలోని సిలోక్‌లో లభించిన విష్ణుశిల్పం నిర్మాణ శైలి అద్భుతం. మేడ మీద హాలులో మన మొదటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ధరించిన దుస్తులు (ఆయన పాట్నాలో లాయరుగా ఉన్నప్పుడు), ఆయన శంకుస్థాపన చేసినపుడు వాడిన వెండి తాపీలు, పళ్లేలు, సుత్తులు విదేశాలలో పర్యటించినప్పుడు అక్కడ బహూకరించిన జ్ఞాపికలు వగైరాలు ఉన్నాయి. ఈ అంతస్థులోని కంచువిగ్రహాలు అన్నీ బౌద్ధమతానికి చెందినవే. 9 నుంచి 11వ శతాబ్దికి చెందినవి కొన్ని అద్భుతమైన కళాఖండాలు ఇక్కడ దర్శనమిస్తాయి. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు సంబంధించిన చారిత్రక ప్రదేశం సదాకత్ ఆశ్రమ్.



## హర్మందిర్

ఇది పాత నగరంలో పోస్టాఫీసుకు ఎదురుగా ఉంది. మూడంతస్థుల పాలరాతి భవనం. సిక్కుల గురు పరంపరలో 10వ గురువు గోవిందసింగ్ జన్మించిన పవిత్ర స్థలం. సిక్కులకు అతి పవిత్రమైన యాత్రాస్థలం. ఈ ఇంటిలో వాళ్ల అమ్మగారు నీళ్ల తోడిన బావి ఇంకా అలాగే ఉంది. దాని చుట్టూ పాలరాతి గోడ కట్టి చిరస్మరణీయం చేశారు. మందిరంలో ప్రవేశించగానే పెద్ద హాలులో పూజామందిరం మధ్య గురుగ్రంథసాహెబ్ పట్టువస్త్రం కప్పి పూలతో అలంకరించారు. పూజా మందిరం చుట్టూ బంగారు పూత వేసిన ఆర్చి ఉంది. ఇక్కడ పాత నగరంలో సూర్ వంశానికి చెందిన షేర్ షాగా పేరొందిన ఫరీద్‌ఖాన్ లోడ్ నిర్మించిన ఖిల్లా అవశేషాలున్నాయి.



## గోల్ ఘర్

భారతదేశంలోని బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఉన్న ఒక చారిత్రక కట్టడం. దీనిని 1786లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో కెప్టెన్ జాన్ గార్డ్విన్ నిర్మించాడు. ఈ కట్టడం ఒక భారీ గోధుమల గిడ్డంగిగా నిర్మించారు. దీని ప్రధాన ఉద్దేశం 1770లో సంభవించిన భయంకరమైన కరువు తర్వాత ఆహార ధాన్యాలను నిల్వ చేయడం ద్వారా భవిష్యత్తులో కరువు నివారణకు తోడ్పడడం. గోల్ ఘర్ ఒక గోపురం ఆకారంలో ఉంటుంది, దీని ఆకృతి స్థూపం లాంటిది. ఇది దాదాపు 29 మీటర్ల ఎత్తు, 125 మీటర్ల వ్యాసం కలిగి ఉంటుంది. దీని గోడలు చాలా మందంగా ఉంటాయి. ఇది భారీ ధాన్యాలను నిల్వ చేయడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ గిడ్డంగి దాదాపు 1,40,000 టన్నుల ధాన్యాలను నిల్వ చేయగల సామర్థ్యం కలిగి ఉంది. దీనిని ఎన్నడూ పూర్తిగా ధాన్యాలతో నింపలేదని చెబుతారు. గోల్ ఘర్ గంగా నది ఒడ్డున, పాట్నాలోని ఒక ఎత్తైన ప్రదేశంలో ఉంది. గోల్ ఘర్ లోపల రెండు సర్పిలాకార మెట్ల సముదాయాలు ఉన్నాయి, ఒకటి ఎక్కడానికి, మరొకటి దిగడానికి. పైకి చేరుకున్న తర్వాత సందర్శకులు నగరం అద్భుత దృశ్యాన్ని చూడవచ్చు. ఈ కట్టడం బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఒక ముఖ్యమైన ఇంజనీరింగ్ సాంకేతికతకు నిదర్శనం. దీని నిర్మాణంలో కొన్ని లోపాలు ఉన్నాయని, ముఖ్యంగా గిడ్డంగిని నింపడం, ఖాళీ చేయడం కోసం తగిన గాలి ఆడే వ్యవస్థ లేకపోవడం వల్ల దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం గోల్ ఘర్ ఒక ప్రముఖ పర్యాటక ఆకర్షణగా మారింది. దీని చుట్టూ ఉన్న ఉద్యానవనం స్థానికులు, సందర్శకులకు విశ్రాంతి తీసుకునే ప్రదేశంగా ఉంటుంది. రాత్రి సమయంలో లైటింగ్‌తో ఈ కట్టడం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

గోల్ ఘర్‌ను పాట్నా నగరంలో ఒక చిహ్నంగా పరిగణిస్తారు. ఇది బీహార్ చరిత్రతో పాటు బ్రిటిష్ కాలంలోని నిర్మాణ శైలిని తెలియజేస్తుంది. స్థానికులు దీనిని 'గోల్ ఘర్' అని పిలుస్తారు. దీని అర్థం 'గుండ్రని ఇల్లు'.

ఆధునిక పాట్నాలో పాట్నా జంక్షన్, లోకనాయక్ జైప్రకాశ్ నారాయణ్ సేతు (దిఘా –సోన్‌పూర్ రైల్–రోడ్ బ్రిడ్జ్) నగరంలోని ముఖ్యమైన ల్యాండ్‌మార్కులు. బుద్ధ స్మృతి పార్కులో బౌద్ధ చిహ్నాలు, శాంతియుత వాతావరణం చూడముచ్చటగా ఉంటాయి.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

# 5 అక్టోబరు, 2025 నుండి 11 అక్టోబరు, 2025 వరకు



## వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం రుణ బాధలు అధికంగా ఉంటాయి. తీర్చడం కోసం చేసే ప్రతి ప్రయత్నం అంతంత మాత్రంగానే ఉంటుంది. ఎంత శ్రమించి నప్పటికీ చేతికి వస్తున్న ఆదాయానికి సరిపడా ఎప్పటి కప్పుడు ఖర్చులు ఏర్పడుతూ ఉంటాయి. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి. రుణాలను తీర్చే అవకాశం లేకుండా పోతుంది.

### వృషభం

ఈ వారం ఆహార పానీయాల పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. విదేశీ ఉత్పత్తుల పట్ల ఆకర్షణ ఉన్నప్పటికీ కొన్ని కార్యక్రమాల నిమిత్తం ఆరోగ్య సూత్రాలను పాటిస్తారు. తల్లితండ్రులను ఏ కష్టం రానివ్వకుండా చూసుకోవాలని మీరు చేసే ప్రయత్నాలు బాగుంటాయి. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి.

### మిథునం

ఈ వారం రహస్య మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలకు పెట్టుబడులను అందిస్తారు. ప్రేమ వివాహాలు వ్యవహారాలు విఫలమవుతాయి. బ్యాంకు రుణాల గురించి అధికంగా ఆలోచిస్తారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణీ దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది.

### కర్కాటకం

ఈ వారం కొంతమంది వల్ల నిరాశ ఎదురవుతుంది ఆశించిన స్థాయిలో వారి అండదండలు లభించకపోవచ్చు. రెన్యువల్స్ కోసం దరఖాస్తు దాఖలు చేస్తారు. కళ్ళకు చక్రాలు కట్టుకొని మరి పనిచేస్తారు. ప్రయోజనాలను కోల్పోకూడదు మన పిల్లలకి దక్కాలి అని భావిస్తారు, శుభవార్త వింటారు. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి.

### సింహం

ఈ వారం జ్యేష్ట సంతానం పట్ల మక్కువ కనబరుస్తారు. వాళ్ళ నిమిత్తం కొన్ని వస్తువులు విలువైన ఆస్తులను పోగు చేస్తారు. దూరప్రాంత ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. భూ సంబంధిత క్రయవిక్రయాలు అనుకూలిస్తాయి. శ్రీ లక్ష్మీ చందనంతో సుబ్రమణ్య స్వామి వారికి అభిషేకం జరిపించండి. కొంతమంది మధ్యవర్తుల ద్వారా విలువైన సమాచారాన్ని అందుకో గలుగుతారు.

### కన్య

ఈ వారం జీవిత భాగస్వామి సలహాలను పాటిస్తారు ప్రయోజనాలను దక్కించుకుంటారు. నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. చేస్తున్న ఉద్యోగంలో మాత్రం సంతృప్తి ఉండకపోవచ్చు. కీళ్ల నొప్పులు శిరోవేదన సతమతమవుతారు. వినోద కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. శారీరకంగా మానసికంగా అలసటకు గురి అవుతారు. శ్రీ లక్ష్మీచందనంతో సుబ్రమణ్యస్వామి వారికి అభిషేకం జరిపించండి.

### తుల

ఈ వారం రుణాల సమస్య తీరక సతమతమవుతారు. వడ్డీలు కట్టలేక కొత్త రుణాలు తీసుకునే విధంగా ఉంటుంది. పాత మొక్కుబడులను వెనువెంటనే తీర్చి వేయాలని ఆలోచిస్తారు. స్వల్పమైన పురోగతిని సాధిస్తారు. శ్రీ లక్ష్మీ చందనంతో సుబ్రమణ్యస్వామి వారికి అభిషేకం జరిపించండి. మెడికల్ రిప్రజెంటేటివ్‌కు సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కాలం అనుకూలంగా ఉంటుంది.

### వృశ్చికం

ఈ వారం శుభకార్యాల నిమిత్తం దీర్ఘాలోచన చర్చలు ఊహించిన స్థాయిలో ఫలితాలు ఉండవు. స్వయంకృతాపరాదాలు చోటు చేసుకోకుండా ఎప్పుడు ఏ పనులు ప్రారంభించాలో ఆ ప్రకారంగా చేసుకుంటే బాగుంటుంది. ఓం నమశ్శివాయ వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. ఆహార నియమాల విషయంలో ఖచ్చితమైన శ్రద్ధ అవసరం. అనారోగ్య సమస్యలు వాటిల్లే అవకాశం ఉన్నది.

### ధనస్సు

ఈ వారం ఆర్థిక విషయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సంఘంలో మీకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటారు. గతంలో మీకు సానుకూల పడని వ్యవహారాలు నేడు సానుకూల పడతాయి. అరటినార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన జరిపించండి. ప్రభుత్వ పరమైన కొన్ని కాంట్రాక్టులు, లీసులు, లైసెన్సులు, కలిసి వస్తాయి. కొంతమంది చేయించే సిఫార్సులు మీకు అనుకూల ఫలితాలను ఇస్తాయి.

### మకరం

ఈ వారం ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరంగా వుండండి. బంధుమిత్రుల సలహాలు తీసుకుంటారు. మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. రవాణా శాఖలో ఉన్నవారికి బాగుంటుంది. కొత్త వాహనాన్ని వ్యాపార నిమిత్తం కొనుగోలు చేస్తారు. ప్రతి ఒక అంశం పట్ల శ్రద్ధ కనబరుస్తారు. అన్ని విషయాల గురించి సేకరిస్తారు. తెలియనివి మనకి అనవసరం అనుకోరు, అన్ని తెలుసుకోవాలి అన్న విధముగా నడుచుకుంటారు.

### కుంభం

ఈ వారం కొత్త ఆలోచనలు, ప్రణాళికలు రూపొందిస్తారు. మీ ప్రతిభ పాటవాలను వెలుగులోకి తీసుకు వస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల సంఘసేవ కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ఆటంకాలన్నీ తొలగిపోతాయి. కొన్ని సందర్భాలలో నిజాలు మాట్లాడుకోలేని పరిస్థితిని నెలకుంటాయి.

### మీనం

ఈ వారం దూరదృష్టితో ఆలోచించి రాబోయే రోజుల్లో అవసరాలన్ని దృష్టిలో ఉంచుకొని ఈరోజు నుండే చిన్న చిన్న పథకాల ద్వారా ధనాన్ని పోగు చేయాలన్న ఆలోచనలు ముడిబడతాయి. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. జీవిత భాగస్వామి నుండి ధన లాభం పొందుతారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులకి మార్కెటింగ్ ఫీల్డ్‌లో ఉన్న వారికి ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు వస్తాయి.

# ఈ వారం కార్టూన్స్


ఇక నీవు మారవు!
నీవు గులాబీని చూస్తుంటే తను ముళ్ళనే చూస్తున్నావు!!


మన చిన్నప్పుడు వానా కాలం, చలి కాలం, ఎండా కాలం అని ఉండేవి.. ఇప్పుడు వానాకాలం, ఎండా కాలం ఉన్నాయి.. అంతే!


ఇష్టం వచ్చిన టైంకు వస్తే కుదరదు!!
200 సుంకం విధిస్తున్నాను!!
శ్రీమతి ట్రంపరి.
BA





చైనాలోని యాంగ్‌టై గ్రామానికి సంబంధించిన చిత్రాలివి. ఆ ఊరి చుట్టూ ఎత్తయిన కోటగోడ ఉంటుంది. అదీ ఈ ఊరి ప్రత్యేకత. ఊరు తాబేలు ఆకారంలో వున్నందువల్ల ఈ గ్రామాన్ని టర్టిల్ విలేజ్ అని కూడా పిలుస్తారు.

